

గోదారి పరుగులు

గోదావరి తగ్గుముఖం పట్టింది.. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు తగ్గడంతో గోదావరి శాంతించింది. 6

సంతాన సాఫల్య కేంద్రాల తనిఖీ

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారుల్లో కదలిక తెచ్చిన ఆంధ్రజ్యోతి



డీఎంహెచ్‌వో తనిఖీ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు, ఇతర వైద్యులు ఆయా ఆసుపత్రులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏఆర్‌టీ, సరోగసీ సంతాన సాఫల్యకేంద్రాల్లో సేవా లోపాలపై రెండు రోజుల కిందట 'ఆంధ్రజ్యోతి'లో అమ్మబడును, అమ్మతనానికో రేటు పేరుతో ప్రచురితమైన కథనంపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికార యంత్రాగంలో కదలిక వచ్చింది.ఈ మేరకు ఏఆర్‌టీ, సరోగసీ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫిర్యాదులకు సంబంధించి ఫోన్ నెంబరును సోమవారం అందుబాటులోకి తెచ్చిన అధికారులు మంగళవారం రాజమహేంద్రవరంలోని ఏఆర్‌టీ, సరోగసీ ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఆయా ఆసుపత్రుల్లో నిబంధనలకు అనుగుణంగా సేవలు అందుతున్నాయా లేదా అన్న విషయాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. సంబంధింత డాక్యుమెంటేషన్‌ను సక్రమంగా నమోదు చేయాలని కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి తనిఖీలు మరింతగా కొనసాగుతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజీవ్, డిప్యూటీ డెమో సత్యకుమార్, రాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ ఫిర్యాదులకు ప్రత్యేక సెల్

కలెక్టర్ ప్రశాంతి



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా, డివిజన్ , మండల స్థాయిలలో గ్రీవెన్స్ సెల్‌లు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి అన్నదాత సుఖీభవ, గృహనిర్మాణం, కమేండ్ ఏరియా అభివృద్ధి, పీ4 సర్వే, సంక్షేమ వసతి గృహాలు తదితర అంశాలపై డివిజన్ , మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు.అన్నదాత సుఖీభవ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల వివరాలకు ఆధార్ లింకింగ్ కీలకమన్నారు. లబ్ధిదారుల ఖాతాకు ఆధార్ లింకింగ్ లేని కారణంగా డీబీటీ జమ కావడంలేదన్నారు. అన్నదాత ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వివరాలకు గ్రీవెన్స్ సెల్ నెంబరు 0883-2944455 అందుబాటులో ఉంటుందన్నారు.గృహ నిర్మాణాలు పురోగతి లేని మండలాల్లో ఎంపీడీవోలు, గృహనిర్మాణ అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.పీ4 బంగారు కుటుంబాలపై దృష్టి సారించాలని,సర్వే వేగవంతం చేయాలన్నారు. కాలువల పూడికతీత పనులపై క్షేత్రస్థాయి నివేదిక కోరారు.ప్రతి శనివారం వసతి గృహాలను ఎంపీడీవోలు,తహశీల్దార్లు సందర్శించాలన్నారు. దోమల నివారణ, మెష్‌లు ఏర్పాటుకు మండల, పంచాయతీ నిధుల నుంచి ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు,డీఆర్వో సీతారామమూర్తి,హౌసింగ్ పీడీ భాస్కరరెడ్డి, సీపీవో అప్పలకొండ, డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆపరేషన్లు సరిగా చేయలేదు..

గోకవరంలో వైద్య బృందం ఎదుట కన్నీళ్లు పెట్టుకున్న మహిళలు

గోకవరం, జూలై29(ఆంధ్రజ్యోతి): వైద్యుల చేసిన శస్త్రచికిత్సలు విఫలమై అనారోగ్యానికి గురైన మహిళలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం గోకవరం ప్రభుత్వాసుత్రిలో విచారణ జరిపారు.గోకవరం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జేసీ చిన్నరాముడుకు సోమవారం గండికోట విష్ణు అనే వ్యక్తి తన భార్యకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురు వైద్యులతో కూడిన బృందం బాధి తులను ఆసుపత్రిలోనే విచారించారు. నిర్లక్ష్యంగా శస్త్ర చికిత్స చేసిన వైద్యుల గురించి బాధిత మహిళలు కమిటీ సభ్యులకు వివరించారు. మండలంలోని గుమ్మ ళ్ళదొడ్డి, అచ్చుతాపురం, పెంటపల్లి, రంపయర్రంపాలెంతో ఇతర ప్రాంతాలకు చెందిన మొత్తం ఆరుగురు బాధితులు శస్త్ర చికిత్స అనంతరం వారు ఎదుర్కొన్న ఇబ్బందులను విచారణ బృందానికి వివరించారు. తమకు కుట్లు సక్రమంగా వేయకపోవడంతోనే ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యామని వాపోయారు. చివరకు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేస్తేనే గాని ఇబ్బందులు తొలగలేదని బాధిత మహిళలు బృందం వద్ద కన్నీటిపర్యంతమయ్యారు. అనంతరం శస్త్రచికిత్స చేసిన వైద్యులు, పలువురు సిబ్బంది విచారించారు. బాధితులకు అందించిన వైద్య సేవలపై ఆరా తీశారు.విచారణలో భాగంగా ఇరుపక్షాల వాదనలపై నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అంద జేస్తామని బృందం సభ్యులు తెలిపారు.

నోట్లు.. కట్టలు..గుట్టలు!



ఉమ్మడి జిల్లాలో 145 కోట్లు

బ్యాంకుల్లో అన్ క్లయిమ్డ్ డిపాజిట్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా పదేళ్లకుపైగా ఏ మాత్రం లావాదేవీలు జరగని అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లు రూ.145 కోట్లకుపైగా ఉన్నట్టు అంచనా వేశారు. ఈ డబ్బు కోసం పదేళ్ల నుంచీ ఎవరూ రాకపోవడంతో వాటిని ఆర్‌బీఐకి పంపేశారు. స్టేట్‌బ్యాంకు, యూనియన్ బ్యాంకు, గ్రామీణ బ్యాంకు తదితర ప్రభుత్వరంగ బ్యాంకు బ్రాంచ్‌ల్లో రూ.90 కోట్ల వరకు డబ్బు పేరుకుపోయింది. ఆ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ తదితర బ్యాంకుల్లో రూ.35 కోట్ల వరకు నగదు ఉండిపోయింది. కొన్ని బ్యాంకు ఖాతాల్లో రూ.లక్షల్లో నగదు ఉండిపోయినట్టు బ్యాంకులు గుర్తించాయి. అత్యధికంగా ఈ తరహా కేసులు నగరాలు, పట్టణాల పరిధిలో ఉన్నట్టు బ్యాంకులు విశ్లేషించాయి. ఆర్‌బీఐకి బదిలీ చేసిన తర్వాత ఖాతాలో బయటకు సున్నా బ్యాలెన్స్ చూపిస్తుంది. అందులో ఉండిపోయిన నగదు ఆర్‌బీఐ వద్దే ఉంటుంది.



- ఉమ్మడి జిల్లాలో రూ.145 కోట్లపైనే
- పదేళ్ల పైనుంచీ ఖాతాల్లో డబ్బులు
- బ్యాంకుల్లో లావాదేవీలు నిల్
- అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లుగా గుర్తింపు
- ప్రభుత్వ బ్యాంకుల్లో రూ.90 కోట్లు
- ఆ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ,ఐసీఐసీఐ
- 330 బ్రాంచ్‌ల్లో కోట్లు
- ఆర్‌బీఐకి పంపేసిన బ్యాంకులు
- ఆధారాలతో వెళితే ఇచ్చేస్తారు

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో బ్యాంకుల్లో జనం డబ్బు మూలుగుతోంది. ఏళ్ల తరబడి తీయకపోవడంతో కోట్లకు కోట్లు పేరుకుపోతోంది. ఒకటి కాదు రెండుకాదు... పదేళ్లకుపైగా ఆయా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు తీయకపోవడంతో అవన్నీ అన్ క్లయిమ్డ్ డిపాజిట్లుగా మారిపోతున్నాయి. ఆ డబ్బులను బ్యాంకులు చూసీచూసీ ఆర్‌బీఐకి పంపించేస్తున్నాయి. ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 35 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన 330 బ్రాంచ్‌ల్లో దాదాపుగా రూ.145 కోట్లకుపైగా నగదు అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లుగా బ్యాంకులు గుర్తించాయి. అత్యధికంగా ఎస్‌బీఐ, యూబీఐ తదితర బ్యాంకుల్లో డబ్బులు కోట్లలో పోగపడగా, తర్వాత ప్రైవేటుబ్యాంకుల్లోను ఉన్నాయి.

పదేళ్లు దాటితే అంతే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ,ప్రైవేటు బ్యాంకులు 35 వరకు ఉండగా వీటన్నింటికి కలిపి 330 వరకు బ్రాంచ్‌లున్నాయి. వీటిలో ప్రజలు మొత్తం రూ.48,500 కోట్ల వరకు డిపాజిట్లు చేశారు. ఒక్క కాకినాడ జిల్లాలోనే రూ.21,307 కోట్లు ఉన్నాయి. ఖాతాదారులు సేవింగ్స్, కరెంట్ ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో డబ్బులు పొదుపు చేస్తారు. తరచూ ఖాతాలో డబ్బులు జమ చేయడం, విత్‌డ్రా చేసుకోవడం జరుగుతుంది. కానీ కొన్ని సేవింగ్స్, కరెంట్ ఖాతాలు మాత్రం ఏళ్ల తరబడి అసలు ఏ లావాదేవీ జరగకుండా ఉండిపోతున్నాయి. వీటిలో ఉన్న డబ్బులను విత్‌డ్రా చేసుకోవడానికి ఎవరూ రావడం లేదు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు ఇలా ఏలావాదేవీ జరగని బ్యాంకు ఖాతాలపై ఆయా బ్రాంచ్‌లు కన్నేసి ఉంచుతాయి. తొలుత రెండేళ్ల పాటు ఏ లావాదేవీ జరగని ఖాతాలుంటే వాటిని నిర్వహణలో లేని ఖాతాగా గుర్తిస్తారు. బ్యాంకు ఖాతాలో డబ్బులు ఉండి కూడా పదేళ్ల వరకు వాటిపై ఏలావాదేవీ జరగకపోతే దాన్ని అన్‌క్లయిమ్డ్‌గా భావిస్తారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఇలా పదేళ్ల పాటు ఉండిపోయిన బ్యాంకు ఖాతాలను ఆయా బ్యాంకులు ఆర్‌బీఐకి పంపాల్సి ఉంటుంది. దీన్నే డీఈఏ (డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్)గా పిలుస్తారు. ఒకవేళ ఆర్‌బీఐకి ఈ తరహా బ్యాంకు ఖాతాలను పంపకపోతే అందులో ఉన్న ఖాతాదారుల డబ్బు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉన్నందున పదేళ్లు దాటిన ఖాతాల సొమ్మును ఆర్‌బీఐకి బ్యాంకులు పంపుతాయి.

తెలియక కొందలా..

ఖాతాదారుడి అకౌంట్‌లో డబ్బులు ఉన్నా ఆ తర్వాత చనిపోయిన ఘటనల్లో ఈ తరహా డిపాజిట్లు పేరుకుపోతున్నట్టు లీడ్‌బ్యాంకు అధికారులు వివరించారు. ఖాతాదారుడు అవివాహితుడో.. లేదంటే గుర్తుతెలియని ప్రదేశాల్లో చనిపోయి ఇప్పటికీ ఆచూకీ దొరకని ఘటనలు, ఖాతాదారుడు చనిపోగా, పిల్లలు,ఇతర రక్తసంబంధీకులు విదేశాల్లో ఉండిపోయి ఇక్కడకు రాని ఘటనల్లో ఈ తరహా అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లు పెరుగుతున్నట్టు పేర్కొన్నారు. ఖాతాదారుడి అకౌంట్లో డబ్బులున్నా సదరు వ్యక్తి మరణం తర్వాత ఆ విషయం వారసులకు తెలియని ఘటనలు సైతం ఇందుకు దోహదం చేస్తున్నాయని తెలిపారు. కొందరు ఖాతాల్లో డబ్బులున్నట్టు గుర్తించి విత్‌డ్రాకు ప్రయత్నిస్తున్నా వారసత్వ ధ్రువీకరణ విషయంలో ఇబ్బందులు ఇందుకు కొంత కారణంగా మారుతున్నాయి. అనేకమంది ఫలానా ఖాతా తమ వారిదేనని వస్తున్నా అందుకుతగ్గ సరైన ఆధారాలు చూపడం లేదని బ్యాంకులు పేర్కొంటున్నాయి.

కొవిడ్ తర్వాత ఇలా..

కొవిడ్ తర్వాత అనేక బ్యాంకు ఖాతాలు అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లుగా మారినట్టు బ్యాంకులు చెబుతున్నాయి. రిజర్వుబ్యాంకు ఆదేశాల మేరకు 2023లో 100 రోజులు 100 పేమెంట్స్ కింద అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లు తిరిగి చెల్లించేందుకు శ్రీకారం చుట్టింది.ప్రతి జిల్లాలో ప్రతి బ్యాంకు తమ టాప్ 100 అన్ క్లెయిమ్ డిపాజిట్లకు సంబంధించి ఖాతాదారులను గుర్తించి నగదు సెటిల్ చేయాలని కోరింది. కానీ ఉమ్మడి జిల్లాలో పెద్దగా ఈ ప్రయోగం ఫలించలేదు. ఖాతాదారులకు అందించేందుకు ఆర్‌బీఐ ఉద్గమ్ (అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు -గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్)పేరిట సెంట్రల్ వెబ్ పోర్టల్‌ను 2023 ఆగస్టులో ప్రారంభించింది. దీని ద్వారా రిజిస్టర్ వినియోగదారులు అన్ని బ్యాంకుల్లోని అన్ క్లెయిమ్డ్ డిపాజిట్ల సమాచారం పొందేలా వివరాలు ఉంచింది.ఎవరికైనా అనుమానం ఉంటే రిజి స్టర్ అయి చెక్ చేసుకోవచ్చని సమాచారం. లేదంటే బ్యాంకులకు వెళ్లి వివరాలు కోరినా చెప్పే అవకాశం ఉంది.

హేవలాక్..అభివృద్ధికి స్మాల్ బ్రేక్!



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- తొలుత రూ.58 కోట్ల కేటాయింపు
- రూ.46 కోట్లకు తగ్గించిన వైనం
- బరువు విషయమై పునరాలోచన

అఖండగోదావరి పర్యాటక ప్రాజెక్టులో స్వల్ప మార్పులు చేశారు. హేవలాక్ బ్రిడ్జిపై వివిధ రకాల కట్టడాలతో బరువు పెంచితే సమస్య ఏమైనా ఉంటుందా అనే ఆలోచనతో ఆచితూచి అడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో హేవలాక్-బ్రిడ్జిలంక అంచనా వ్యయం కొంత తగ్గించారు. మొదట సుమారు రూ.58 కోట్లతో ఇక్కడ పర్యాటక హంగులు ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు.ప్రస్తుతం ఇక్కడ సుమారు రూ.46 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. హేవలాక్ బ్రిడ్జిని అన్ని భద్రత చర్యలతో మంచి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. దీనికి అనుబంధంగా బ్రిడ్జిలంకను అభివృద్ధి చేయడానికి నిర్ణయించారు.దీనికి సంబంధించి ఇంకా టెండర్ల ప్రక్రియ ఆరంభం కాలేదు. బ్రిడ్జిలంకలో టెంట్ సిటీ, బోటింగ్ ఏర్పాటు చేస్తారు. మొత్తం అఖండ గోదావరి ప్రాజెక్టును స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (శాస్కి) పథకం ద్వారా రూ.94.44 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు సీఎం నారా చంద్రబాబు 2015 పుష్కరాల్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. పుష్కరఘాట్ పనులకు టెండర్లు పిలవడంతో పాటు పనులు ఆరంభించారు. కడియపులంకలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా అభివృద్ధి చేయనున్నారు.ఇక్కడ ఇంకా టెండర్లు ఖరారు కాలేదు. కానీ ముందుగా ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ పనులు పూర్తి చేసే యోచన చేస్తున్నారు. నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయాభివృద్ధి జరగనుంది. నిడదవోలు కాలువలో బోట్ షికారు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయమే లాభదాయకం

వ్యవసాయాధికారి మాధవరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకుండా రైతులు ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని మహాకాళేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న అరుణాప్యాలెస్‌లో మంగళవా రం ప్రకృతి వ్యవసాయంపై రాజమహేంద్రవరం సబ్ డివిజన్ పరిధిలో గ్రామ వ్యవసాయ,ఉద్యాన సహాయకులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ శిబిరం ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం లాభదాయకమన్నార. ఏటీఎం పెరటి తోటలు, ఏ గ్రేడ్ మోడల్లో వివిధ పంటల సాగుపై మెలకువలు తెలిపారు.జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు మాట్లాడుతూ పలు పంటల్లో శాస్త్రవేత్తలు పరిశోధనల సిఫారసుకు అనుగుణంగా సమగ్రమైన సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ వరిసాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ పద సంచాలకులు తాతారావు, జిల్లా వనరులు కేంద్రం ఏడీఏ జయరామలక్ష్మి, రాజమహేంద్రవరం వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారులు భీమరాజు, సూర్యరమేష్, కల్యాణ్, అర్బన్ ఏఈవో వేణుమాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల వెనకడుగు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)



గతంలో సర్కారు పనులంటే కాంట్రాక్టర్లు క్యూకట్టేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లను భయపెట్టి వదిలేసింది.. దీంతో పనులు చేయడానికి ముందుకు రావడంలేదు. నిధులిస్తేనే పనులు చేస్తామంటూ భీష్మించుకుని కూర్చుంటున్నారు. పంచాయతీ రాజ్ ద్వారా 2025-26 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో ఉపాధి హామీ పథకం నుంచి నియోజకవర్గానికి రూ.12 కోట్ల వంతున సీసీ,బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు.జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో మొత్తం రూ.84 కోట్లతో సుమారు 700 సీసీ, బీటీ రోడ్లను నిర్మించనున్నారు. డ్రెయిన్ల పనులకు ఏ విధమైన శాంక్షన్లు లేవు. కనీసం ఈ రోడ్ల పనులైనా మొదలవుతాయంటే పల్లె పండుగ బిల్లులు పెండింగ్ ఉండడంతో ఈ పనులు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం.

ఇదీ కారణం...

తెలుగుదేశం- జనసేన- బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల నిర్మా ణంపై దృష్టి పెట్టారు. పల్లె పండుగ పేరుతో గత అక్టోబరు నుంచి మార్చి వరకూ జిల్లాలో అనేక ఉపాధి హామీ పథకం కింద రూ. 65.92 కోట్ల నిధులతో జిల్లాలో మొత్తం 667 సీసీ రోడ్లు నిర్మించారు. జిల్లాలో చిన్నా పెద్ద కాంట్రా క్టర్లు సుమారు 50 మందికి పైగా ఈ పనులు చకచకా చేశారు. అధికారులు ముందుగా మే ల్కొనకపోవడం వల్ల కాబోలు గత మార్చి చివరికే మంజూరు కావాల్సిన బిల్లులు కదల్లేదు. కేవలం రూ.19 కోట్లు చెల్లించారు.ఇంకా రూ.46 కోట్ల 92 లక్షల 80 వేలు చెల్లించాల్సి ఉంది. ఈ బిల్లులు వస్తేనే కొత్త పనుల్లో కదలిక వస్తుంది.

పల్లె పండుగ పనులు ఇలా..

మండలం	పనులు	బిల్లులు(కోట్లలో)
అనపర్తి	50	3.33
బిక్కవోలు	70	3.49
రంగంపేట	43	3.64
కొవ్వూరు	10	2.23
చాగల్లు	11	0.85
తాళ్లపూడి	17	2.21
ఉండ్రాజవరం	57	3.00
నిడదవోలు	84	4.09
పెరవలి	39	3.80
గోపాలపురం	12	1.43
దేవరపల్లి	18	2.36
నల్లజర్ల	38	4.67
రాజానగరం	32	4.00
కోరుకొండ	19	7.55
సీతానగరం	5	1.70
గోకవరం	50	10.75
రాజమండ్రి రూరల్	96	4.44
కడియం	16	2.34

- పల్లె పండుగ బిల్లులు పెండింగ్
- చెల్లించాల్సింది రూ.47 కోట్లు
- రోడ్లకు ఉపాధి నిధులు
- రూ.84 కోట్ల పనులకు ఆదేశం
- ముందుకు రాని కాంట్రాక్టర్లు
- సర్కారు పనులపై అనాసక్తి

కాంట్రాక్టర్ల ఎదురుచూపు..

పల్లె పండుగ నిధులు రాక కాంట్రాక్టర్లు విలవిల్లాడుతున్నారు. రూ. 50 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకూ పెట్టుబడి పెట్టిన వారు ఉన్నారు.పాత బిల్లులు వచ్చేస్తే.. కొత్త రోడ్ల నిర్మాణానికి ముందుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. వర్షాల వల్ల చాలా రోడ్లు పాడైపోతున్నాయి. ప్రస్తుతం మంజూరైన నిధులతో పనులు చేస్తే గ్రామాల్లో మరిన్ని మౌలిక సదుపాయలు కల్పించినట్టు అవుతుంది. ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయి.

పగలు వైద్యం.. రాత్రికి తాళం!



సోమవారం రాత్రి మూసివేసిన ఆసుపత్రి

మంత్రి దుర్గేష్ ఇలాఖాలో ఇదీ వైద్య సిబ్బంది తీరు

- 24 గంటలు వైద్య సేవలు నిల్
- అందుబాటులో ఉండని సిబ్బంది
- అత్యవసరమైనా అంతే
- వేరే ప్రాంతాల నుంచి విధులకు
- ఆరు గ్రామాల ప్రజల ఇక్కట్లు
- సమిశ్రగూడెం పీహెచ్‌సీ దుస్థితి

నిడదవోలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అది సాక్షాత్తూ మంత్రి దుర్గేష్ ఇలాఖా..అంటే ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి..సేవలు సక్రమంగా అందించాలి.. లేదంటే పనిష్మెంట్ అనేది చాలా సివియర్‌గా ఉంటుంది..ఎందుకంటే మంత్రి కదా.. అయినా ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం విధుల్లో అలసత్వం వీడడంలేదు..ఇది ఎక్కడో అయితే పరవా లేదు.. ఎందుకంటే ఒక రోజు కాకపోతే మరో రోజు చేసుకోవచ్చు.సాక్షాత్తు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఈ పరిస్థితి ఉంటే కష్టమే కదా మరి..నిడదవోలు మండలం సమిశ్రగూడెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటలు వైద్య సేవలందించాలి.అయితే పగలు మాత్రమే సేవలందిస్తూ రాత్రి సెలవు తీసుకుంటుంది.అయినా పట్టించుకునేవారులేరు..కన్నెత్తి చూసేవారే లేరు.

అత్యవసరమైతే అంతే..

నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో 2016 సంవత్సరంలో పది పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేశారు. సుమారు ఆరు గ్రామాల ప్రజలకు వైద్య సేవలందించాలి.ఈ ఆసుపత్రిలో ఇద్దరు వైద్యాధికారులు ఒక ఎంపీహెచ్‌ఈవో, ఒక ఫార్మాసిస్ట్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక పీహెచ్‌ఎన్, ఎంపీహెచ్ఎస్ ఫిమేల్ ఒకరు తదితర సిబ్బంది ఉంటారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీతో పాటుగా అత్యవసర వైద్య సేవలు చూడాలి. దీంతో పాటుగా రాత్రి సమయంలో ఎటువంటి అత్యవసర కేసు వచ్చినా డాక్టర్స్ వచ్చి చూడాలి. అయితే ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పగలు సేవలందుతున్నా సాయంత్రం అయితే చాలు తాళాలు వేసి వెళ్లిపోతున్నట్టుగా స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి సోమవారం రాత్రి 7.30 గంటలకు ఆసుపత్రిని విజిట్ చేయగా అప్పటికే తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. రాత్రి సమయంలో డ్యూటీలో ఉండాల్సి సిబ్బంది లేరు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ 1 స్థానికంగా నివాసం ఉండడం లేదని సమాచారం. రాజమహేంద్రవరం నుంచి పగలు వచ్చి వెళుతుంటారని సమాచారం. దీనిపై మంగళవారం మెడికల్ ఆఫీసర్ 2 డాక్టర్ శ్రీనిధిని వివరణ కోరగా రాత్రి సమయాల్లో స్టాఫ్ నర్సను డ్యూటీలో ఉంచుతున్నామని ఏ సమయంలో అత్యవసర కేసులు వచ్చిన ఆమె ఇచ్చిన సమాచారంతో అటెండ్ అవుతున్నామని తెలిపారు. మంత్రి దుర్గేష్, జిల్లా ఉన్నతాధికారులు ఈ ప్రాథమిక ఆరోగ్య కేం ద్రంపై దృష్టి సారించాల్సి ఉంది.

పీహెచ్‌సీ 24 గంటలు తెరిచే ఉంచాలి

సమిశ్రగూడెం పీహెచ్‌సీలో 24 గంటలు వైద్య సేవలందాలి.రాత్రి సమయంలో అత్యవసర సేవలందించాల్సి వచ్చినప్పుడు ఖచ్చితంగా వైద్యులు అందుబాటులో ఉండాలి. 24 గంటలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తెరిచే ఉండాలి. పీహెచ్‌సీలో వైద్యాధికారులు స్థానికంగానే నివాసం ఉండాలి. లేకపోతే చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో



పగలు తెరిచి ఉంచిన ఆసుపత్రి


అద్భుత ప్రయోగాల గని అంతరిక్షం

- విద్యార్థులు అంతరిక్ష పరిశోధకులుగా ఎదగాలి
- కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో సైన్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి
- అంతరిక్ష అవగాహన శిబిరంలో ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో సమస్త ప్రపంచాన్ని శాసించే శక్తి కేంద్రాలకు అంతరిక్షమే నిలయం కానుంది. ప్రపంచ మానవాళి అంతరిక్షం కేంద్రంగానే నేడు ఎన్నో సేవలను పొందుతోంది. ఇంట్లో కూర్చుని టీవీ చూడగలుగుతున్నా, సెల్‌ఫోన్ వినియోగిస్తున్నా, శాటిలైట్ సినిమాలు చూడాలన్నా, వినాశకర యుద్ధ పరికరాలకు సిగ్నల్స్ అందాలన్నా అంతరిక్షమే కేంద్రంగా ఉంది. అటువంటి అంతరిక్షంలో ఎన్నో వింతలు, విశేషాలు ఉన్నాయి. చంద్రుడు, అంగారకుడు వంటి ఎన్నో గ్రహాలు ఉన్నాయి. ఆయా గ్రహాల్లో నీరు ఉందా. జీవరాశులు ఉన్నాయా,మానవ మనుగడకు అవకాశం ఉందా. విలువైన ఖనిజ సంపదలు ఉన్నాయా ఇలా ఎన్నింటినో తెలుసుకునేందుకు నిరంతరం పరిశోధనలు కొనసాగుతూనే ఉన్నాయి. అటువంటి పరిశోధనల్లో భాగంగా భవిష్యత్తులో విద్యార్థులను అంతరిక్ష పరిశోధకులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రవ్యాప్తంగా తొలిసారిగా అంతరిక్ష అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతరిక్ష అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభ రీతిలో అర్థమయ్యేలా ప్రాక్టికల్స్ కోసం అమలాపురంలో సైన్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అమరావతి ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా, ముస్కాన్ సంస్థల సహకారంతో నిర్వహించిన అంతరిక్ష అవగాహన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి టెలిస్కోప్‌ను పరిశీలించారు. ఏఆర్‌వీఆర్ పరికరంతో అంతరిక్షంలోని వింతలను వీక్షించారు. డ్రోన్ల వినియోగాన్ని ప్రాక్టికల్‌గా విద్యార్థులకు దగ్గరుండి చూపించారు. రోబోటిక్స్ వర్చువల్ రియాలిటీ అనే అంశాలను స్పేస్ ఎడ్యుకేటర్లు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భమిడిపాటి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ సైన్స్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం రూ.20లక్షల అంచనా వ్యయంతో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ప్రయోగపూర్వకంగా సైన్స్‌ను వివరిస్తే విద్యార్థులు ఎప్పటికీ మరిచిపోరన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను అంతరిక్ష పరిశోధకులుగానే కాకుండా భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే సైన్స్ సెంటర్ల లక్ష్యమన్నారు. విద్యార్థులు ఇంజనీరింగ్‌లో సాఫ్ట్‌వేర్ రంగం ఒకటే ఉందనుకుంటే పొరపాటు. ఇస్రో, నాసావంటి అంతరిక్ష పరిశోధనా సంస్థల్లో అద్భుత అవకాశాలు ఉన్నాయి. ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు.

ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ 300 ఏళ్ల చరిత్ర గల అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలను పెంచుకోవాలని సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి.మమ్మీ కోరారు. ప్రతి శాస్త్రోత్సవ ప్రదర్శనలో సీవీ రామన్ త్రీడీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కంభంపాటి హరిసూర్యనారాయణ రూ.20వేలు విరాళాన్ని ఎమ్మెల్యే ఆనందరావుకు అందించగా ఆయన జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యానికి అందజేశారు. సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు, ముస్కాన్ సీఈవో ప్రాజేష్ దేవ్‌నాథ్, జిల్లా ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బీర హనుమంతరావు, సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ (సీఎంవో) బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, సీహెచ్ ఘన సత్యనారాయణ, సైన్స్ ఫోరం అధ్యక్షుడు బెహరా సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, కౌన్సిలర్ సంసాని బులినాని తదితరులు పాల్గొన్నారు.





గాగుల్స్‌తో అంతరిక్షాన్ని చూస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు







విద్యార్థుల సమక్షంలో డ్రోన్లతో పాటు ఇతర ప్రదర్శనలు



పాఠశాల స్థాయి నుంచి ప్రోత్సహించడమే లక్ష్యం

కేశినేని వెంకటేశ్వర్లు, సీఈవో,
సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అమరావతి



పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా పది కేంద్రాల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తాం. బుడమేరు వరదల సమయంలో డ్రోన్స్ ఉపయోగించి పేదలను ఆదుకున్న విధానాలను వివరించడంతో పాటు చంద్రయాన్-2 ప్రయోగాలపై విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. మాజీ రాష్ట్రపతి, అంతరిక్ష పరిశోధకుడు అబ్దుల్ కలాం స్ఫూర్తితో భవిష్యత్తు శాస్త్రవేత్తలను తీర్చిదిద్దేందుకు సైన్స్ సిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

గాగుల్స్‌తో అంతరిక్షంలోకి వెళ్లా

ముంగండ లోహిత,
9వ తరగతి, గూడాల



అంతరిక్ష అవగాహన శిబిరంలో భాగంగా గాగుల్స్ ధరించా. అవి పెట్టుకోగానే అంతరిక్షంలోకి వెళ్లడమే కాదు పక్క నుంచి రాకెట్లు వెళ్తున్నట్టు కనిపించింది. అంతరిక్షంలో ఎన్నో వింతలు చూడగలిగా. ఏఆర్‌వీఆర్ పరికరం ధరించగానే అంతరిక్ష అద్భుతాలు దర్శనమిచ్చాయి. అంతరిక్షంలో అన్ని వింతలు ఉన్నాయా అనిపించింది.

రాకెట్ తయారీలో పాల్గొనాలని ఉంది

ఓదూరి గోవర్ధన్‌వెంకటదుర్గ
10వ తరగతి,
అమలాపురం



రాకెట్ తయారీ నమూనాను చూపించారు. తీసుకువచ్చిన రాకెట్ నమూనాను పూర్తిగా విడదీసి లోపల ఏమేమి ఉంటాయో చూపించారు. తిరిగి విద్యార్థులతోనే రాకెట్‌ను తయారు చేయించిన తీరు అద్భుతం. భవిష్యత్తులో రాకెట్ తయారీలో పాల్గొనాలని ఉంది. గ్రహాలపైకి వెళ్లే రోవర్స్ ఫొటోలు తీసే విధానాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు.

అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెరిగింది

ఎస్.మాధురి,
స్కూలు అసిస్టెంట్,
ఫిజికల్ సైన్స్,
మూలపాలెం



అంతరిక్ష అవగాహన శిబిరంతో విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెరిగింది. ఇప్పటివరకు పుస్తకాల్లోను, టీవీల్లోను మాత్రమే రాకెట్ ప్రయోగాలను చూశారు. రాకెట్లను నేరుగా అంతరిక్షంలోకి ప్రయోగించే విధానాలను వివరించిన తీరు అద్భుతం. పాఠ్యాంశాలను ప్రాక్టికల్‌గా చూపించడం ద్వారా విద్యార్థులు స్పేస్ సైన్స్‌పై ఆసక్తి పెంచుకుంటున్నారు.

అలలు ఎగసి... రోడ్డును ఛిద్రం చేసి...



బీచ్ రోడ్డును తాకుతున్న అలలు

- కొత్తపట్నం వద్ద ధ్వంసమైన రహదారి
- గోతుల్లో పడి గాయాలపాలవుతున్న వాహనచోదకులు

కొత్తపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉవ్వెత్తున ఎగసిపడుతున్న రాకాసి అలల ధాటికి కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో బీచ్ రోడ్డు ధ్వంసమవుతోంది. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో పాటు సముద్రంలో ఏర్పడే పోటు, పాట్లతో అలలు తాటి చెట్టు ఎత్తున ఎగసిపడుతున్నాయి. దీంతో ఉప్పాడ-కాకినాడ మార్గంలో కొత్తపట్నం వద్ద బీచ్ రోడ్డు ఛిద్రమైంది. రాత్రిపూట మోటారు సైకిళ్లపై వెళ్లేవారు ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురులో అగాధాల్లాంటి గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. తక్షణం మరమ్మతులు చేయాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.





ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డులో కొత్తపట్నం వద్ద ఛిద్రమైన రోడ్డు

స్మార్ట్ సిటీకి రూ.485 కోట్లు వినియోగం

- కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి టోకహాన్ సాహూ
- రాజ్యసభలో పలు కీలక అంశాలను ప్రస్తావించిన ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాజ్యసభల ప్రశ్నోత్తరాల సమయంలో మంగళవారం టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పలు కీలక అంశాలు ప్రస్తావించారు. స్మార్ట్ సిటీస్ మిషన్ అమలు వివరాలపై, జాతీయ ఖనిజ అన్వేషణ నిధి కింద రాష్ట్రంలో జరుగుతున్న ప్రాజెక్టులపై ఎంపీ సతీష్‌బాబు కేంద్రాన్ని ప్రశ్నించారు. ఈ అంశాలపై కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి టోకహాన్ సాహూ సమాధానం ఇచ్చారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద దేశవ్యాప్తంగా 100 నగరాలు ఎంపిక చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం నగరాలు ఈ మిషన్ కింద ఉన్నాయన్నారు. మొత్తం రూ.48 వేల కోట్లు కేంద్ర నిధుల మంజూరు చేయగా, ఇప్పటి వరకు రూ.47,459 కోట్లు నిధులు 99శాతం నగరాలకు విడుదలయ్యాయన్నారు. కాకినాడ స్మార్ట్ సిటీకి కేంద్రం రూ.490 కోట్లు మంజూరు చేయగా, రూ.485 కోట్లు ఖర్చు చేశారన్నారు. 2025 జూలై 11వ తేదీ నాటికి రాష్ట్రంలో స్మార్ట్ మిషన్ కింద మొత్తం 280 ప్రాజెక్టులు చేపట్టారని సహాయ మంత్రి సాహూ తెలిపారు. అలాగే జాతీయ ఖనిజ అన్వేషణ నిధిపై అడిగిన ప్రశ్నకు కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సమాధానమిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నాలుగు ఎన్ఎంఈటీ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయన్నారు. వీటి కోసం రూ.11 కోట్లు మంజూరయ్యాయని, ప్రధానంగా నికెల్, రెయిన్‌ఎర్త్ ఎలిమెంట్స్ వంటి ఖనిజాల అన్వేషణకు ఈ ప్రాజెక్టులు దోహదపడుతున్నాయన్నారు. అలాగే పోర్టులు, షిప్పింగ్, వాటర్‌వేస్‌లపై అడిగిన ప్రశ్నకు కేంద్ర పోర్టులు, షిప్పింగ్, వాట ర్వేస్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ సమాధానం ఇవ్వగా, ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకంపై అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీహర్ష్ మల్హోత్రా సమాధానమిచ్చారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన మక్కల్ నీది మయ్యం(ఎంఎన్ఎం) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమలహాసన్‌ను పార్లమెంట్ భవన్‌లో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



రాజ్యసభకు ఎన్నికైన కమలహాసన్‌ను పార్లమెంట్ భవన్‌లో కలిసిన సతీష్‌బాబు

పట్టులో దిగుబడి, నాణ్యత కీలకం

మైసూరు సెంట్రల్ సిల్క్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ గాంధీదాస్



చేబ్రోలులో పట్టుగూళ్లను పరిశీలిస్తున్న డాక్టర్ గాంధీదాస్

గొల్లప్రోలు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టులో దిగుబడితో పాటు నాణ్యత కీలకమని, ఈ దిశగా రైతులకు పూర్తి సహకారం అందజేస్తామని మైసూరు సెంట్రల్ సిల్క్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ ఎస్.గాంధీదాస్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పట్టు పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఫంక్షన్ హాలులో మేరా రేషమ్-మేరా అభిమాన్(నా పట్టు-నా అభిమానం) కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సిల్క్ సమగ్ర-3 కార్యక్రమంలో భాగంగా పట్టు రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. అసంపూర్ణంగా ఉన్న మార్కెట్ షెడ్డును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టుపరిశ్రమ శాఖ రాష్ట్ర అదనపు సంచాలకురాలు అరుణకుమారి మాట్లాడుతూ పట్టు రైతులకు ఇన్సెంటివ్ బకాయిల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా విడుదల చేస్తామన్నారు. యాంత్రీకరణ సహా అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సదస్సులో పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్వీవీ సత్యనారాయణ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల పట్టు పరిశ్రమ శాఖ అధికారులు పాల్‌రాజు, కోనేటి అప్పారావు, సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్తలు డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ మురళి, బి.వజ్రమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- ఎటపాక జవహర్ నవోదయలో రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు
- తొలిరోజు పాల్గొన్న 8 క్లస్టర్ల విద్యార్థులు



ఎటపాకలో టేబుల్ టెన్నిస్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఎటపాక, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు మంగళవారం నుంచి ఉల్లాసంగా ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతోపాటు అండమాన్ నికోబార్, లక్షద్వీప్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కృష్ణా, కడప, ఖమ్మం, షిమోగా, తుంకూర్, పతనంతిట్ట, వయనాడ్, బీదర్ క్లస్టర్ల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. తొలిరోజు నిర్వహించిన పోటీల్లో 40 మంది విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబర్చారు. అంతకుముందు టెబుల్ టెన్నీస్ పోటీలు ప్రారంభ సమయంలో మార్చ్ ఫాస్ట్‌తో గౌరవ వందనం సమర్పించారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు జరుగనున్నాయి. తొలుత ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ మాట్లాడారు. క్రీడలతో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశానికి మంచిపేరు తేవాలి

పెద్దాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా దేశానికి మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురావచ్చని ప్రముఖ పారిశ్రామికవేత్త, లలిత ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాస్ అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని పీఎంశ్రీ నవోదయ విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రాంతీయ కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యా ర్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని, విద్యతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. తమ లక్ష్యాలను విద్యార్థి దశలోనే నిర్దేశించుకోవాలన్నారు. నవోదయ విద్యాలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.సీతలక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీనివాస్

ఆహ్లాదంగా నన్నయ యూనివర్సిటీ: వీసీ



ఉడ్‌చిప్పర్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, జూలై 29(ఆంధ్రజ్యోతి): నన్నయ విశ్వవిద్యాలయానిన అహ్లాదకర ప్రాంగణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీ సుందరీకరణలో భాగంగా చెట్ల కొమ్మలు, పొదలు వ్యర్థాలను చిప్స్‌గా మార్చే షైజోవీమా ఉడ్‌చిప్పర్ యంత్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ప్రాంగణంలోని చెట్లు, మొక్కల వ్యర్థాలను చిప్స్‌గా మార్చేందుకు ఈ యంత్రం ఉపయోగపడుతుందని, ఈ చిప్స్‌ను కంపోస్టు ఎరువుగా లేదా ఇతర అవసరాలకు ఉపయోగిస్తామన్నారు. ప్రకృతి నుంచి వచ్చిన దానిని తిరిగి ప్రకృతికి అందించి పర్యావరణ సమతుల్యత పాటించవచ్చునని వీసీ అన్నారు. కార్యక్రమంలో డీన్ ఇన్‌ఛార్జి అధికారి బి.జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సీఈఆర్‌టీ శిక్షణకు సంధ్యారాణి ఎంపిక



సంధ్యారాణికి ప్రొసీడింగ్స్ అందిస్తున్న డీఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీపురం సుంకర భాస్కరరావు మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో స్కూలు అసిస్టెంటుగా పనిచేస్తున్న కందనాల సంధ్యారాణి బెంగుళూరులోని రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్‌లో నిర్వహించే (స్టేట్ కౌన్సిల్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) 30 రోజుల కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి తూర్పుగోదావరి జిల్లాలోని మునిసిపల్ హైస్కూలు నుంచి సంధ్యారాణి ఎంపిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరు కావడానికి అవసరమైన ప్రొసీడింగ్స్ సంధ్యారాణికి అందజేశారు. ఈ అవకాశం రావడానికి సహకరించిన స్కూలు హెడ్మాస్టర్ సన్యాసిరావుకు సంధ్యారాణి కృతజ్ఞతలు తెలిపారు.

గోదావరి తగ్గుముఖం

6,01,844 క్యూసెక్కులు సముద్రంలోకి..

ధవళేశ్వరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజుల నుంచి పెరుగుతూ తగ్గుతూ ప్రవహించిన గోదావరి ఎగువ ప్రాంతాల్లో తగ్గుముఖం పడుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద మంగళవారం సాయంత్రానికి 6,01,844 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదయ్యింది. ఎగువన భద్రాచలం వద్ద 36.60 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 34.80 అడుగులకు తగ్గింది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 4300, మధ్య డెల్టాకు 2600, పశ్చిమ డెల్టాకు 6000 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా కామాచార్యులు

కాకినాడ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన రామోజు నాగ వెంకటసత్య కామాచార్యులును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం న్యాయ శాఖ జీవోఆర్‌టీ నెం.264 జారీ చేసింది. ఈ అథారిటీలకు సంబంధించిన కేసులను హైకోర్టులో ఈయన వాదిస్తారు. మూడు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.



ఎంపీ పురందేశ్వరితో ఒడిసా గవర్నర్ భేటీ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలో ఉన్న రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరితో ఒడిసా గవర్నర్ కంభంపాటి హరిబాబు భేటీ అయ్యారు. మంగళవారం పురందేశ్వరి నివాసానికి హరిబాబు విచ్చేశారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్రానికి సంబంధించిన పలు విషయాలను వారిరువురు కొద్దిసేపు చర్చించుకున్నారని ఎంపీ కార్యాలయం వర్గాలు తెలిపాయి.

గ్రీన్‌ట్యాక్స్ రద్దుపై హర్షం

- లారీ రవాణా రంగాన్ని ఆదుకోవాలి
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబ్జీ

కాకినాడ రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ట్యాక్స్ రద్దుతో ప్రభుత్వం రవాణా రంగానికి ఎంతో మేలు చేసిందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గన నాగరాజు, జనసేన నాయకుడు హర్షం వ్యక్తం చేశారు. గ్రీన్‌ట్యాక్స్ రద్దు సందర్భంగా ఆయన కాకినాడ రూరల్ మండలం తూరంగి బొడ్డు చెరువు వద్దనున్న తన కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాబ్జీ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సమావేశంలో 26 యూనియన్ల సభ్యులు పాల్గొన్నారని, మూడు జిల్లాల్లోని కలెక్టర్లకు లారీ ఓనర్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా వివరించామన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలతో తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన లారీ రవాణా రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు ఏటా టోల్‌ప్లాజా చార్జీలు పెరగడం వల్ల రవాణా రంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. రవాణారంగంపై వివిధ రకాల పన్నులు, రుసులు పెంచారని, రవాణా కోసం వస్తువులను, లోడ్, అన్‌లోడ్ జరిగేటప్పుడు, లారీ యజమానికి కిరాయి రాకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. లారీ యజమానుల సమస్యలపై కలెక్టర్‌కు త్వరలోనే వినతిపత్రం అందజేస్తామన్నారు.సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వామినాయుడు, సూర్యనారాయణరాజు, అర్జుబాబు, దుర్గాప్రసాద్, నానాజీ,వీరవెంకటరత్నం పాల్గొన్నారు.

ఏం కావాలో తెలుసుకోండి!

- నేటి నుంచి కుటుంబ అవసరాల సర్వే ప్రారంభం
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పీ4 బంగారు కుటుంబాల దత్తత లక్ష్యం 2లక్షల19వేలు
- ఆగస్టు 15 కల్లా ప్రక్రియ పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు



కలెక్టరేట్ (కాకినాడ), జూలై 29 (ఆంధ్రజ్యోతి): పేదలకు మంచిరోజులొస్తున్నాయి. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పీ4 బంగారు కుటుంబాల దత్తత స్వీకరణ కార్యక్రమం వేగవంతం చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అసలు పీ4 పరిధిలో ఉన్న బంగారు కుటుంబాల అవసరాలు ఏంటో తెలుసుకోవడానికి కుటుంబ అవసరాల(నీడ్ అసెస్మెంట్) సర్వే చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. బుధవారం నుంచి ఆ సర్వే ప్రారంభం కానుంది. ఆగస్టు 15వతేదీ కల్లా పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెలువడ్డాయి.

జిల్లాలవారీగా లెక్కలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2లక్షల 19వేల బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు మార్గదర్శులను గుర్తించాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. దీంతో ఇప్పటి వరకు 62వేల బంగారు కుటుంబాలను మార్గదర్శులను గుర్తించారు. దీనిలో పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్ జీవోలు ఉన్నారు. దీనిలో కాకినాడ జిల్లాలో లక్షా2వేల బంగారు కుటుంబాల దత్తత లక్ష్యం కాగా ఇప్పటి వరకు 35వేల కుటుంబాలను దత్తత స్వీకరించారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 60వేల బంగారు కుటుంబాల దత్తత లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటివరకు 15వేల కుటుంబాలను దత్తత స్వీకరణ జరిగింది. తూర్పుగోదావరి జిల్లా విషయానికి వస్తే 57వేల బంగారు కుటుంబాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 12వేల బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి కొంతమంది మార్గదర్శులు ముందుకొస్తున్నప్పటికీ వారి అవసరాలు ఏంటో ముందే తెలుసుకోవాలని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో కుటుంబ అవసరాల(నీడ్ అసెస్మెంట్) సర్వే చేయడానికి సర్వం సిద్ధం చేసింది. దీని కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ రూపకల్పన చేసింది. ఈ యాప్‌ను ఇప్పటికే కాకినాడ జిల్లా, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉద్యోగులు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాల్లో బుధవారం నుంచి సర్వే ప్రారంభంకానుంది. తూర్పుగోదావరి జిల్లాలో గురువారం నుంచి గానీ, శుక్రవారం నుంచి గానీ ఈ సర్వే చేయనున్నారు. ఈ జిల్లాలో యాప్ డౌన్‌లోడ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

వారిపై ప్రత్యేక దృష్టి...

బంగారు కుటుంబాల్లో వితంతువులు, ఒంటరి మహిళలపై ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరిస్తారు. వీరికి ఇతర కుటుంబసభ్యుల మద్దతు ఉందా లేదా అనే విషయాలను విచారణ చేస్తారు. ఒంటరి మహిళల అవసరాలను తెలుసుకుని యాప్‌లో నమోదు చేస్తారు. పింఛన్, ఇతర ఆర్థిక సాయాలు ఏం అందుతున్నాయి వంటి వివరాలు సర్వే ద్వారా తెలుసుకుని నమోదు చేస్తారు.

సచివాలయ ఉద్యోగుల ద్వారా సర్వే

కుటుంబ అవసరాల సర్వే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల ఆధ్వర్యంలో సర్వే జరుగుతుంది. ప్రభుత్వం వీరికి ఇచ్చిన ప్రత్యేక యాప్ ద్వారా ఆయా బంగారు కుటుంబాల వద్దకు వెళ్తారు. ఆయా కుటుంబాల అవసరాలను తెలుసుకుని దానిలో నమోదు చేస్తారు. ఉదాహరణకు ఒక కుటుంబంలో నలుగురు సభ్యులు ఉంటే వారిలో ఎంతమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయి... వారు ఎలాంటి విద్యార్హత కల్గి ఉన్నారు.. ఎలాంటి ఉపాధి కల్పిస్తే ఆర్థికంగా నిలబడతారు.. వంటి అంశాలు పరిశీలిస్తారు. ఆయా బంగారు కుటుంబాలు ప్రధానంగా ఎలాంటి సమస్యవల్ల సతమత మవుతున్నా రు వంటి అంశాలను విచారణ చేసి నమోదు చేస్తారు.

కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలి

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ప్రారంభించిన బంగారు కుటుంబాల దత్తతకు జిల్లాలో కార్పొరేట్ సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రులు, పరిశ్రమల యాజమాన్యం, గ్యాస్ ఏజెన్సీలు, హేచరీలు, పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ముందుకు రావాలి. ఎన్‌జీవోలు, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించాలి. దీని వల్ల పేదలను ఆర్థికంగా, సామాజికంగా పైకి తేవాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. బంగారు కుటుంబాల మార్గదర్శకులు దత్తత స్వీకరణ కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది.

– కాకినాడ జిల్లా కలెక్టర్, షాన్‌మోహన్

ఏలేరుకు గోదావరి జలాలు



ఏలేరులోకి చేరిన గోదావరి జలాలు

ఏలేశ్వరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టుకు మంగవారం గోదావరి జలాలు ప్రవేశించాయి. ప్రాజెక్టులోకి 175 క్యూసెక్కుల నీరు చేరుతోంది. జగ్గంపేట మండలం రామవరం వద్ద స్టేజ్2 నుంచి పంపుల ద్వారా నీటిని ఏలేరుకు తరలిస్తున్నారు. గోదావరి జలాలు ఏలేరుకు చేరడంతో ప్రాజెక్టుపై ఆధారపడిన సుమారు 56వేల ఎకరాలకు సాగు సరఫరా చేసేందుకు వీలుంటుంది. ఇన్నాళ్ల ప్రాజెక్టులో కేవలం 10.46 టీఎంసీల నీరు మాత్రమే ఉండేది. ఈ నీటినే పంపుల ద్వారా విశాఖకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు సాగుపై ఆందోళన ఏర్పడింది. ఇప్పుడు గోదావరి నీరు వస్తుండడంతో రైతుల ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ప్రాజెక్టు స్థితిగతులు

ప్రస్తుతం ప్రాజెక్టులో 86.56 మీటర్ల ఎత్తున 24.11 టీఎంసీలను నిల్వచేయవచ్చు. వర్షాలు కురవకపోవడంతో నీరు చేరలేదు. దీని వల్ల వారంక్రితం వరకు ప్రాజెక్టులో కేవలం 10.31 టీఎంసీల నీరు మాత్రమే ఉండేది. ప్రస్తుతం ఏలేరులో 77.25 మీటర్ల స్థాయిలో 10.46 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. ఖరీఫ్ సాగుకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా నీరు విడుదల చేస్తామని ఏలేరు అధికారులు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం సాగుకు 1300 క్యూసెక్కుల వంతున, ఎ డమ కాలువ నుంచి విశాఖకు 200 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని చెప్పారు.

మద్యం షాపుపై పోలీసుల దాడి

పలువురికి గాయాలు



గాయపడి చికిత్స పొందుతున్న రాజీవ్

కరప, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో ఒక మద్యం దుకాణాన్ని పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేసి మద్యం సేవిస్తున్న వారిపై దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిత్ర గార్డెన్ ఎదురుగా ఉన్న తిరుమల వైన్స్ వద్దకు సోమవారం రాత్రి 9 గంటల సమయంలో పోలీసులు వచ్చి బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై దాడి చేశారు. రాజీవ్ అనే వ్యక్తి చేతులకు రక్తపు గాయాలు కాగా మిగిలిన వారు తలో దిక్కుకు పరుగులు తీశారు. మద్యం దుకాణం సిబ్బంది బాధితుడికి చికిత్స చేయించారు. దురుసుగా ప్రవర్తించిన పోలీసుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై కరప ఎస్ఐ సునీతను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పోలీసులు దాడి చేయడం అవాస్తవం అన్నారు. ప్రధాన రహదారిని చేర్చి ఉన్న 2 మద్యం దుకాణాలపై ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో వాటిని నిరోధించే ప్రయత్నంలో పోలీసులు అక్కడి వెళ్లారని తెలిపారు. పోలీసులను చూసి పారిపోతుండగా ఒక వ్యక్తికి చేతులకు రేకులు గుచ్చుకుని రక్తపు గాయాలయ్యాయ న్నారు. నూసెన్స్ కలిగిస్తున్న 2మద్యం దుకాణాలపై బైండోవర్ కేసులునమోదు చేస్తామన్నారు.

పదో తరగతి విద్యార్థినికి గర్భం..

పాఠశాల కరస్పాండెంట్‌పై పోక్సో కేసు

పరారీలో నిందితుడు

కోనసీమ జిల్లా డీఈవో విచారణ



స్కూల్‌ను తనిఖీ చేసిన డీఈవో సలీం బాషా

రాయవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిని లోబర్చుకుని గర్భవతిని చేసిన కరస్పాండెంట్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని ఓ గ్రామంలోని ప్రైవేటు ఫౌండేషన్ స్కూల్ కరస్పాండెంట్ ఎ.షాజీ జయరాజ్ ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. 10వతరగతి బాలికపై కన్నేసి కొన్ని నెలల క్రితం బెదిరించి గర్భవతిని చేశాడు. బాలిక తల్లిదండ్రులు ఈనెల 28న రాయవరం పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పర్యవేక్షణలో జయరాజ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్టు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. ఆ ఫౌండేషన్ స్కూల్‌ను మంగళవారం కోనసీమ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా తనిఖీ చేశారు. 8,9,10 తరగతులు అనుమతులు లేకుండా ఏ విధంగా నిర్వహిస్తున్నారు అనే విషయాన్ని డీఈవో ఆరా తీశారు. పాఠశాల యాజమాన్యంపై సమగ్రమైన దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాలిక కుటుంబ సభ్యులను కలిసి సంఘటనపై ఆరా తీశారు. డీఈవోతో పాటు ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, సీఐ దొరరాజు, ఎస్ఐ సురేష్ బాబు, ఐసీడీఎస్ అధికారులు బాలిక కుటుంబ సభ్యులను కలిసి విచారణ జరిపారు. కాగా కరస్పాండెంట్ జయరాజ్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం పోలీసులు వెతుకుతున్నారు.

దళితుడిపై దాడి కేసులో మరో నిందితుడి అరెస్ట్

అమలాపురం టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): దళితుడు దోనిపాటి మహేశ్వరరావుపై దాడి చేసిన కేసులో మరో నిందితుడిని అరెస్టు చేసినట్టు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కీలక ఆధారాలను సేకరించి ఇప్పటికే ఐదుగురు నిందితులను అరెస్టు చేశామన్నారు. మంగళవారం కోనసీమ జిల్లా ఈదరపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి దుర్గామహేష్ అలియాస్ మహేష్‌ను అతడి ఇంటి వద్ద అరెస్టు చేసి అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచామన్నారు. నిందితుడికి కోర్టు 14రోజులు రిమాండు విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టు అయిన యల్లమిల్లి విజయ్ రవిశంకర్, ఉరదల బాలరాజు, యర్రా కృష్ణ, మల్లాడి సుదర్శన్, తోట నాగవెంకటసత్యనారాయణ రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని డీఎస్పీ ప్రసాద్ తెలిపారు.

దారి దోపిడీ ఘటనపై దర్యాప్తు ముమ్మరం

విచారణకు 5 ప్రత్యేక బృందాలు

సీసీ కెమెరాల పరిశీలన



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్

గొల్లప్రోలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారు చెందుర్తి రోడ్డులో జరిగిన దారి దోపిడీ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దోపిడీకి పాల్పడిన ఆగంతకులను గుర్తించి పట్టుకునేందుకు 5 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ చేపట్టారు. రాజమహేంద్రవరం నల్లమందు సందులోని భవానీ సిల్వర్ ప్యాలెస్‌లో గుమస్తాగా పనిచేస్తున్న సమీర్ ప్రజాప్రత్ పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలుల్లో వెండి, బంగారు వస్తువులు డెలివరీ ఇచ్చి వారు ఇచ్చిన ముడి వెండి, నగదును తీసుకుని ఎన్‌హెచ్ 216 నుంచి చెందుర్తి వెళ్లే రోడ్డులోకి వెళ్లగా పామాయిల్ తోటల వద్ద సోమవారం రాత్రి 2 మోటార్‌సైకిళ్లపై నలుగురు ఆగంతకుల వచ్చి అతడిపై దౌర్జన్యం చేసి బెదిరించి ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగులను లాక్కుని పరారయ్యారు. ఇందులో 12.5కిలోల వెండి వస్తువులు, ముడి వెండి, 51 గ్రాముల బంగారం వస్తువులు, 60వేలు నగదు ఉన్నట్టు ప్రజాప్రత్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పిఠాపురం సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. కేసులో విచారణకు పిఠాపురం సీఐ, సర్కిల్‌లోని నలుగురు ఎస్ఐల నేతృత్వంలో 5 విచారణ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్, కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో వారు విచారణ చేపట్టారు. పిఠాపురం నుంచి గొల్లప్రోలు వరకూ, 216వ జాతీయరహదారి వెంబడి ఉన్న గోడౌన్లు, రైసుమిల్లులు, ఇతర భవనాల సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. సంఘటన జరిగిన సమయంలో వెళ్లిన ద్విచక్ర వాహనాలను గుర్తించే పనిలోపడ్డారు. ఇంత భారీ మొత్తంలో వెండి, బంగారు వస్తువులను ఎటువంటి రక్షణ లేకుండా ఎలా తీసుకువెళ్తున్నాడు అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. తెలిసిన వారు చేశారా, లేకా సమీర్ ప్రజాప్రత్ రాకపోకలను గుర్తించి రాజమహేంద్రవరం లేదా పెద్దాపురం, పిఠాపురం నుంచి వెంబడించి ఆగంతకులు ఈ పని చేశారా అనే విషయాన్ని వారు పరిశీలిస్తున్నారు. ఫిర్యాదులోని అంశాలపైనే బాధితుడిని వివిధ కోణాల్లో ప్రశ్నించి వివరాలు రాబట్టారు.

'జయలక్ష్మి సొసైటీ బాధితులను భయాందోళనకు గురిచేయవద్దు'



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు, డైరెక్టర్లు

సర్పవరం జంక్షన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జయలక్ష్మి సొసైటీ పాలకవర్గంపై నిరాధార ఆరోపణలు చేసి బాధితులను భయాందోళనకు గురి చేయవద్దని ఆ సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు కోరారు. మంగళవారం కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో గల ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ సంస్థ ప్రధాన కార్యాలయంలో సొసైటీ డైరెక్టర్లు చింతా సుబ్బారావు, షేక్ జానీ భాషా, కె గౌరీశంకర్‌లతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.582 కోట్ల ఆర్థిక కుంభకోణం కేసులో సుమారు రూ.80 కోట్లకు మాత్రమే సెక్యూరిటీ ఉందని, మిగతా డిపాజిట్లకు ఎటువంటి ఆధారాలు లేని స్థితి నుంచి సుమారు రూ.500 కోట్లకు పైగా నిందితుల ఆస్తులను గుర్తించి, 13 జీవోలు జారీ కావడ్డాయని, సీఐడీతో ఈ ఆస్తులను జప్తు చేయించి కోర్టులో వేయించడం జరిగిందన్నారు. రూ.300 కోట్ల ఆస్తుల జప్తుపై ట్రిబ్యునల్‌కి వెళ్లగా, ఇందులో 13 కేసులకు సంబంధించి రూ.30 కోట్లపై కోర్టు వాయిదాలకు నిందితులు హాజరుకాకపోవడంతో ట్రిబ్యునల్ కోర్టు నుంచి డిక్రీ ప్రకటన జారీ అయిందన్నారు. దీని ఆధారంగా ఈపీ దాఖలు చేసి సదరు రూ. 30 కోట్లు స్థిరాస్తులను సొసైటీ పేరున దఖలకు అనుకూలంగా తీర్పు ఇవ్వాలని పిటిషన్ వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాధితులకు న్యాయం చేసేందుకు పాలకవర్గ డైరెక్టరు పూర్తి పారదర్శకంగా పని చేస్తున్నామన్నారు. బాధితులకు సత్వర న్యాయం కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేస్తే సత్వరంగా సెటిల్ అవుతాయన్నారు. బాధితుల తరపున జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి లెటర్ రాయడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. సొసైటీపై ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టబద్ధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్ట్

1,142 కిలోల గంజాయి స్వాధీనం : రంపచోడవరం డీఎస్పీ సాయి ప్రశాంత్



పట్టుబడిన గంజాయి బస్తాలను చూపిస్తున్న డీఎస్పీ సాయి ప్రశాంత్

రంపచోడవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతం నుంచి తరలిస్తున్న 1,142 కిలోల గంజాయిని రంపచోడవరం పోలీసులు పట్టుకోగా ఈ కేసులో నలుగురిని మంగళవారం అరెస్ట్ చేశారు. డీఎస్పీ జి.సాయి ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సబ్ డివిజనల్ పోలీస్ ఆధికారి ఉత్తర్వులపై ఇతర జిల్లాలకు గంజాయి రవాణా చేస్తున్నట్టు సమాచారం రావడంతో జూన్ 27న మండలంలోని తాళ్లపాలెం వేళ్లే రోడ్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా బొలెరోలో రవాణా చేస్తున్న 1,142 కిలోల గంజాయిని స్వాధీన పర్చుకున్నారు. అప్పుడు నిందితులు పారిపోయినట్టు డీఎస్పీ తెలిపారు. నిందితులు వదిలి వెళ్లిన వాహనాల ఆధారంగా పాడేరు, చింతపల్లి, నర్సీపట్నం ప్రాంతాల్లో విచారణ చేసి అరెస్టు చేశామన్నారు. అరెస్ట్ అయినవారిలో అల్లూరి జిల్లా చింతపల్లి మండలం గ్రుంటుపల్లికి చెందిన జెమ్మిలి రాజేష్, కొత్తవీధి మండలం పెట్రాయికి చెందిన కోడ శ్రీకాంత్, చింతపల్లి మండలం వీరవరం గ్రామానికి చెందిన వంతల కిరణ్, తెలంగాణ రాష్ట్ర వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం చంద్రతండాకు చెందిన భుక్యా దేవేందర్ ఉన్నట్టు పేర్కొన్నారు. బొలేరో, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ మార్కెట్‌లో రూ.కోటి 10 లక్షలు ఉంటుందన్నారు. దాడుల్లో సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ వెంకట్రావు పాల్గొన్నారు.

రైలులో పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అందజేత



తునిలో ప్రయాణికుడికి ల్యాప్‌టాప్‌ని అందజేస్తున్న రైల్వే పోలీసులు

తునిరూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నుంచి తుని వరకు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (డీ-3 కోచ్) లో ప్రయాణించిన ఓ వ్యక్తి తన ల్యాప్‌టాప్‌ను రైలులో మర్చిపోయి దిగిపోయాడు. కాకినాడ జిల్లా తుని జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జీఆర్‌పీ ఎస్ఐ శ్రీనివాసరావు అదే రైలులో విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లకు సమాచారం అందించారు. వారు వెంటనే స్పందించి బ్యాగ్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఎస్ఐ శ్రీనివాసరావు బ్యాగ్‌ను ప్రయాణికుడికి అందజేశారు.

అరటి, కొబ్బరి తోటల నరికివేతపై దీక్ష

ప్రత్తిపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఇ.గోకవరం గ్రామంలో అరటి, కొబ్బరి తోటలను దౌర్జన్యంగా నరికివేతపై బాధిత రైతు రిలే నిరాహార దీక్ష చేపట్టాడు. తన పొలంలో ఏర్పాటు చేసుకున్న శిబిరంలో రైతు రాజమండ్రికి చెందిన సత్తి వినోద్ రెడ్డి, పలువురు రైతులు దీక్షలు చేపట్టారు. వినోద్‌రెడ్డి మాట్లాడుతూ తమ భూమికి క్రయ దస్తావేదులు, రికార్డులు ఉన్నప్పటికీ ఏ సంబంధం లేని చింతాకుల భాస్కరరావు, ధర్మాజీ, మరికొందరు ఈనెల 23న పొలంలో సాగు చేపట్టిన అరటి, కొబ్బరి మొక్కలను దారుణంగా నరికివేశారని వాపోయాడు. దీనిపై ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారన్నారు. ఈ భూ వివాదం కారణంగా తనకు ప్రాణహాని కూడా ఉందని... పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని కాపాడాలని బాధితుడు కోరారు.



కాకినాడ జిల్లా ఇ.గోకవరంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న రైతు

దళితులకు అత్యంత ద్రోహం చేసిన జగన్ : హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): దళిత వ్యతిరేక కార్యక్రమాలు చేసిన జగన్ ఇప్పుడు దళితులపై దాడులు జరగకుండా దళిత ఫోర్స్ ఏర్పాటు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాలలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. దేశ చరిత్రలో దళితులకు అత్యంత ద్రోహం చేసిన వ్యక్తి మాజీ సీఎం జగన్ అని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో దళితులను కులవివక్షతతో అణిచివేశారన్నారు. దళితులకు ఉప యోగపడే 25 సంక్షేమ పథకాలను రద్దుచేశాడని చెప్పారు. దళితుల గురించి మాట్లాడే అర్హత, హక్కు జగన్‌కు లేదన్నారు.. మమ్మల్ని మేము రక్షించుకోవడం, మా హక్కుల కోసం పోరాటం చేయడం మాకు తెలుసునని నిన్ను నమ్మే పరిస్థితి దళిత సమాజంలో లేదని అన్నారు.

పారదర్శకంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్

దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దు

విశాఖపట్నం ఆర్మీ అధికారులు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 5నుంచి 20 వరకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు విశాఖపట్నం ఆర్మీ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఆర్మీలో ఉద్యోగాల కోసం దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని పేర్కొన్నారు. ప్రధానంగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులకు నియామకం జరుగుతుందన్నారు. 8 నుంచి 10 తరగతి పాస్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, అనకాపల్లి, ఏలూరు, ఎన్‌టీఆర్, కాకినాడ జిల్లా, యానాం నుంచి ర్యాలీకి అడ్మిట్ కార్డులు పొందిన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. గత మార్చి 12న ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ర్యాలీ నోటిఫికేషన్ ప్రకారం అన్ని ధ్రువపత్రాలు, ఫోన్‌లను తీసుకురావాలని.. దళారులు, ఏజెంట్లు, మధ్యవర్తుల్ని నమ్మవద్దని కోరారు.

అదృశ్యమైన ఇద్దరు బాలికలు..

సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత

సర్పవరం జంక్షన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఎస్.అచ్చుతాపురానికి చెందిన ఇద్దరు బాలికలు అదృశ్యం కాగా సాంకేతిక పరిజ్ఞానంతో వారిని సురక్షితంగా తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పజెప్పారు. కాకినాడ 48వ డివిజన్ పరిధి ఎస్.అచ్చుతాపురానికి చెందిన తంగెళ్ల సూర్యనాగమ్మ-నరసయ్య కుమార్తె రామారావుపేటలోని సంజీవ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. సోమవారం ఉదయం కళాశాలకు వెళ్లిన ఆమె సాయంత్రం ఇంటికి రాకుండా అదే ప్రాంతానికి చెందిన 10వ తరగతి చదువుతున్న మరో బాలికతో కలిసి మిస్సింగ్ అయినట్టు సదరు బాలిక తండ్రి ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో రాత్రి ఫిర్యాదు చేశాడు. ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్ పర్యవేక్షణలో రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో బాలికల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్, సీసీ కెమెరాల ఆధారంగా బాలికలు అమలాపురం వైపు వెళ్తున్నట్టు గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన అమలాపురం పోలీసులు బాలికలను మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకుని వారి సమాచారాన్ని ఇంద్రపాలెం పోలీసులకు అందించారు. దీంతో ఎస్ఐ ఎం.వీరబాబు సిబ్బందితో కలిసి అమలాపురం వెళ్లి బాలికలను పోలీస్‌స్టేషన్‌కి తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇచ్చిన అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. ఫిర్యాదుపై తక్షణం స్పందించి తమ కుమార్తెలను సురక్షితంగా అప్పగించేలా చర్యలు తీసుకున్న ఎస్పీ బిందుమాధవ్, ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు, సిబ్బందికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు బాలికలతో ఎస్ఐ వీరబాబు

ఆర్టీసీ డ్రైవర్‌కు మూడు బంగారు పతకాలు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా రవీంద్రపాడులో ఈ నెల 26, 27న జరిగిన రాష్ట్ర స్థాయి అమరావతి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాకినాడకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ మందపల్లి శ్రీనివాసరావు 3 బంగారు పతకాలు సాధించారు. నవంబరులో భూటాన్‌లో జరిగే అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు, జనవరిలో బెంగళూరులో జరిగే ఏషియన్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఆయన్ని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవివర్మ, కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు అభినందించారు.



శ్రీనివాసరావును అభినందిస్తున్న ఆర్టీసీ ఈడీ

కడియపులంకలో పోలింగ్ బూత్‌ల తనిఖీ



కడియపులంకలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీపీవో శాంతామణి

కడియం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడియపులంక గ్రామంలో వచ్చే నెల 10వ తేదీన సర్పంచ్ పదవికి ఉప ఎన్నిక జరుగనుంది. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి గ్రామాన్ని సందర్శించి పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. కడియపులంక, బుర్రిలంక, వెంకయ్యపేట ప్రాంతాలకు సంబంధించి 36 పోలింగ్‌బూత్‌లను ఏర్పాటు చేశామని, 15,165 మంది ఓటర్లు ఉన్నారని ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసరావు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, లైటింగ్, వైద్యసేవలు ఏర్పాటు చేయాలని డీపీవో సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ పరిశుభ్రతకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నల్లం శ్రీనివాస్‌తోపాటు స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తపాలా జీవిత బీమా కొత్త ఏజెంట్లకు వచ్చే నెల 13న ఇంటర్వ్యూలు

డివిజనల్ సూపరింటెండెంట్ శేషారావు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలు సేకరించేందుకు గాను కొత్తగా ఏజెంట్లను నియమించుకునేందుకు వచ్చేనెల 13న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ కోట శేషారావు తెలిపారు. ఏజెంట్లుగా చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 65 ఏళ్ల లోపు వయసున్న వారు అర్హులని చెప్పారు. నిరుద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు, పూర్వం బీమా ఏజెంట్లుగా ఏదైనా ఇతర సంస్థల్లో పని చేసిన వారు, విశ్రాంత ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, మాజీ సైనికోపాధ్యాయులు బీమా ఏజెంట్లుగా చేరడానికి అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు పూర్తి చేసిన దరఖాస్తు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటాతో ఈనెల 13న రాజమహేంద్రవరం పోస్టల్ డివిజనల్ కార్యాలయంలో ఉదయం 10నుంచి జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన వారిని ప్రాథమికంగా 12నెలల కాలపరిమితికి ఏజెంట్లుగా నియమిస్తూ ఐడీ కార్డు, ఏజెంట్ కోడ్‌తో లైసెన్స్ జారీ చేస్తారన్నారు.నియమితులైన వారు రూ.5 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలని, ఈ డబ్బుకు సరిపడా ఎన్ఎస్‌సీ బాండు ఏజెంట్ పేరున జారీ అవుతుందని శేషారావు తెలిపారు. మరింత సమాచారం కోసం తపాలా జీవిత బీమా డెవలప్మెంట్ ఆఫీసర్ ఎస్ఎంకే కిషోర్ నెంబరు 93981 71879ను సంప్రదించాలన్నారు.

పేదలకు వరం.. ముఖ్యమంత్రి సహాయ నిధి

రాజానగరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరమని జనసేన పార్టీ నాసేన కోసం నావంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి న్నారు. మండలంలో వివిధ అనారో గ్య కారణాలతో చికిత్సల అనంతరం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకు న్న వారికి రాజానగరంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మండలంలో ముక్కినాడ, జి.యర్రంపాలెం, తోకాడ, లాలాచెరు వు, పుణ్యక్షేత్రం, భూపాలపట్నం, కానవరం, వెలుగుబంద, పాతతుంగపాడు, దివాన్‌చెరువు, తూర్పుగోనగూడెం, పల్లకడియం, కొత్తవెలుగు బంద, శ్రీకృష్ణపట్నం, కలవచర్ల, దివాన్‌చెరువు, మల్లంపూడి, పాలచర్ల, నరేంద్రపురం రాధేయపాలెం, గ్రామాలకు చెందిన 31 మందికి మంజూరైన రూ.21 లక్షలు నగదు చెక్కులను ఆయా గ్రామాలకు చెందిన జనసైనికుల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరిత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దుర్గాదేవి

బిక్కవోలు, జూలై 29(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు జరపడం చట్టరీత్యా నేరమని మండల వైద్యాధికారి ఎం.దుర్గాదేవి సూచించారు. రంగాపురం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం టీనేజి ప్రెగ్నెన్సీ వల్ల కలిగే అనర్థాలపై సమావేశం నిర్వహించారు. డాక్టర్ దుర్గాదేవి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం వల్లే ముందస్తుగా గర్భం దాల్చుతారని, దీనివల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, బిడ్డలు తక్కువ బరువుతో పుట్టడం, పుట్టుకతో మానసిక అంగవైకల్యం, పోషకాహార లోపం వంటి సమస్యలు ఎదుర్కోవలసి వుంటుందన్నారు. అబ్బాయిలకు 25, అమ్మాయిలకు 21 ఏళ్లు నిండితేనే వివాహాలు చేసుకోసుకునేలా పెద్దలందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నడింపిల్లి చిరంజీవిరాజు, చెల్లే జోష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు బంగారు రూపులు అందజేత

గోకవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సూర్య కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన బంగారు వరలక్ష్మి కానుక-3 లక్కీ డ్రాకుకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. మండలంలోని మహిళల కోసం ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, పద్మావతి దంపతులు లక్కీ డ్రాను ప్రారంభించారు. విజేతలుగా నిలిచిన 230 మంది మహిళలకు అరగ్రాము చొప్పున బంగారు రూపులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు రామసేన సభ్యులు పాల్గొన్నారు.

చెత్తను వేరు చేసి అందించాలి

వాంబేకాలనీ ప్రజలతో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్



వాంబే కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): చెత్తను వేరు చేసి అందించడం ప్రజలు బాధ్యతగా తీసుకోవాలని మునిసిపల్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సూచించారు. స్థానిక లాలాచెరువు వాంబేకాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ చెత్త సేకరణ వాహనాలు వస్తున్నది లేనిది ఆరాదీసారు. అలాగే తడి, పొడి చెత్తలను వేరు చేసి ఆయా వాహనాలకు అందిస్తున్నది లేనిది అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా కార్పొరేషన్ ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేస్తోందన్నారు. ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి సిబ్బందికి సహకరించాలని కోరారు. అనంతరం డ్రైనేజీలను పరిశీలించి వాటిలో సిల్ట్‌ను తొలగించాలని కాలనీని పరిశుభ్రంగా వుండేలా చూడాల ని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాప్రదేశ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి : ఆర్‌జేడీ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యాప్రదేశ్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రాంతీయ విద్యా సంచాలకురాలు నాగమణి అన్నారు. స్థానిక నారాయణపురంలోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించి విద్యా ప్రదేశ్ కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. తరగతి గది ఆసక్తికరంగా ఉంటేనే విద్యార్థులు బాగా చదువుకుంటారన్నారు. విద్యార్థుల వర్క్‌బుక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ వెంట డీఐ దిలీప్‌కుమార్, హెచ్‌ఎం డి.జయలక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ధర్మస్థలి నిందితులను కఠినంగా శిక్షించాలి

రాజమహేంద్రవరం ఉమెన్స్ కళాశాల ఎదుట మహిళా సమాఖ్య నిరసన



ఉమెన్స్ కళాశాల ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కర్నాటక రాష్ట్రంలోని మంజునాథ దేవాలయం ధర్మస్థలంలో యువతులు, మహిళలపై అత్యాచారం, హత్యోదంతం ఘటనలు తీవ్రమైన ఆవేదన, ఆందోళన కలిగిస్తున్నాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.లావణ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలోని ఉమెన్స్ కళాశాల ఎదుట నిరసన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ ఆశ్రమాలు, ఆలయాలు, ఆధ్యాత్మిక చింతన, భక్తి పేరుతో సమాజంలో కొందరు పెద్ద మనుషులుగా, మత గురువులుగా చెలామణి అవుతూ మహిళలను వంచిస్తూ దారుణాలకు పాల్పడడం కలచి వేస్తోందన్నారు. ఈ విషయంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్ మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీవల్లి, రాజేశ్వరి, ప్రియదర్శిని, హేమ, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

కానరాని పారిశుధ్యం

- గోకవరంలో దోమల బెడద
- వీధుల్లో అపారిశుధ్యం
- రోగాల బారిన మండల ప్రజలు

గోకవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. ఏ వీధి చూసినా, ఏ సందుకెళ్లినా మురుకు కూపాలు, చెత్త, చెదారాలు కనిపిస్తున్నాయి. దీంతో ప్రజలు జలుబు, దగ్గు, జ్వరం వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. అయితే సర్పంచ్‌లు పారిశుధ్య చర్యలు చేపట్టాలనుకున్నా నిధుల లేమితో మిన్నకుండిపోతున్నారు. గత వైసీపీ హయాంలో కేంద్రం నుంచి విడుదలైన నిధులను ఇతర పనులకు మళ్లించింది.

గ్రామాల్లో దోమల వ్యాప్తి

కాగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు సక్రమైన డ్రైనేజీల సౌకర్యం లేక చాలా గ్రామాల్లో నివాస గృహాల మధ్యే వర్షపునీరు నిల్వ ఉండిపోతుంది. దీంతో దోమల బెడద ఎక్కువైంది.పలువురు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. దీనిని చూస్తున్న అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోంది. దోమల వ్యాప్తి నివారణకు మందుల పిచికారీ, ఫాగింగ్ వంటి చర్యలు ఎక్కడా కానరావడంలేదు.

తాగునీటి ట్యాంకుల అపరిశుభ్రత

చాలా పంచాయతీల్లో తాగునీటి నిర్వహణ, ట్యాంకుల శుభ్రత నెలల తరబడి జరగడం లేదు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన సందర్భంలోను, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన సమయంలో మాత్రమే ట్యాంకులు శుభ్రం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



గోకవరంలో డ్రైనేజీ సౌకర్యం లేక రోడ్లపై నిల్వ ఉన్న మురుగునీరు



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త, చెదారాలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పలుచోట్ల తొలి అడుగు



మల్లవరంలో మహిళలతో మాట్లాడుతున్న నెహ్రూ

గోకవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని మల్లవరంలో మంగళవారం నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రా లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాగునీటి ఇబ్బందులను తొలగించాలని, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి వినతులు అందాయి. అనంతరం ఏర్పాటు చేసిన రచ్చబండ వద్ద ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ గతంలో సుమారు రూ.130 కోట్లతో మల్లవరం ఎత్తిపోతల పథకాన్ని తీసుకొచ్చి 17శాతం పనులు పూర్తి చేశామన్నారు. ఆపై అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజానగరం: మండలంలోని కానవరం, మల్లంపూడి గ్రామాల్లో రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, కందుల బాబూరాయుడు, సంగీత సత్యనారాయణ, చిట్టిప్రోలు పద్దరాజు, సోడసాని త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో నేషనల్ టైగర్స్ డే

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నేషనల్ టైగర్స్ డే నిర్వహించారు. కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పులులు అడవుల్లో బలహీనంగా ఉన్న జంతువులను వేటాడడం ద్వారా అడవులను ఆరోగ్యకరంగా ఉంచుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మ్యాగజైన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణశ్రీ, అధ్యాపకులు బీవీ సంజీవరావు, కే.సత్యనారాయణ, ఎం.కాశీ విశ్వనాథం, అశోక్‌కుమార్, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

ముంపు నివారణకు చర్యలు : ఎమ్మెల్యే వాసు



డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగరంలో ముంపు నివారణకు అవసరమైన పనులు కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేపడుతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక 50వ డివిజన్‌లో ఆర్‌టీవో కార్యాలయం వద్ద నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం కల్వర్టు కట్టినప్పటికీ మేజర్ డ్రైన్ లేకపోవడంతో మురుగునీటి ప్రవాహం ఎక్కడికక్కడ ఆగిపోయేదని దీనికి తోడు పైనుంచి వచ్చే నీటితో ఈ ప్రాంతమంతా ముంపుగా మారిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.1.62 కోట్లతో మేజర్ డ్రైన్ నిర్మించుకోగలిగామన్నారు. ఆర్టీవో కార్యాలయం వద్ద డ్రైన్‌పై శ్లాబ్ వేయడానికి టెండర్ పిలుస్తున్నారని, రోడ్డు లెవెల్‌కి స్లాబ్‌లు వేస్తేనే మొత్తం పనులు పూర్తిచేసుకున్నట్టు అవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, ఉప్పులూరి జానకిరామయ్య, మరుకుర్తి రవి యాదవ్, చింతపల్లి నాని, హరి బెనర్జీ, కొత్తల కిషోర్, కోరుమిల్లి విజయశేఖర్, మొకమాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలి : సీపీఐ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ విద్యుత్ మీటర్ల బిగింపును ప్రభుత్వం వెంటనే ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. ప్రజల నడ్డి విరిచే విద్యుత్ భారాలను తగ్గించాలని కోరుతూ ఆగస్టు 5న జరిగే ఆందోళనలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని కూరగాయల మార్కెట్లో ఆగస్టు 6, 7 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కూండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి పి.లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

రూ.26 వేలు వేతనం ఇవ్వాలి

మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.26,000 వేతనం చెల్లించాలని జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు తాటిపాక మధు కోరారు. మంగళవారం కార్మికుల మస్టర్ వేళల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ పనుల అప్పగింత, నిర్వహణ ప్రైవేట్ కంపెనీలు, ఏజెన్సీలకు అప్పగించవద్దని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రెడ్డి రమణ, దానాల దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

బిక్కవోలు, జూలై 29(ఆంధ్రజ్యోతి): నాగ పంచమి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో బిక్కవోలులోని కుమారసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఆలయ ఆవరణలో రజ, కుజ, సర్ప దోష నివారణార్థం భక్తులు వ్రతాలు ఆచరించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాదాన్ని అందించినట్టు ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు.

కోరుకొండ: కోరుకొండలో నూతనంగా నిర్మించిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయార్చకులు భక్తులకు శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో కటకం సత్యనారాయణ,బదిరెడ్డి దొర, నీరుకొండ బాబ్జి, ఉల్లి కాశీ, రామకృష్ణ, వీరేష్ పాల్గొన్నారు.

స్కూలుకు కంప్యూటర్, ప్రింటర్ అందజేత

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ ఉచిత సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక వీరభద్రపురం టౌన్ హైస్కూలుకు ట్రస్ట్ గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా కంప్యూటర్, ప్రింటర్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు యియ్యపు మురళీధర్, కోసూరి సుబ్బరాజు, యలమర్తి వెంకటేశ్వరరావు, కేవీవీ భద్రరావు, దేవత సుధాకర్, లక్కోజు వీరభద్రరావు, హెచ్‌ఎం ఎ.సూరిబాబు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడి

రంగంపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డిగుంట గ్రామంలో మంగళవారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కొత్తపల్లి దుర్గను అరెస్ట్ చేసి, ఆమె నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనపరచుకున్నామన్నారు. ఈ దాడుల్లో స్టేషన్ పోలీసులు పాల్గొన్నారన్నారు.

శ్రీవాణి ట్రస్టు చెక్కు పంపిణీ



శ్రీవాణి ట్రస్టు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరగలంపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారామంజూరైన రూ.1.90 లక్షల చెక్కును సంబంధిత ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయ శాఖాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కచ్చితమైన భూహద్దుల గుర్తింపునకు రీసర్వే

సీతానగరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): రైతుల భూముల కచ్చితమైన హద్దుల గుర్తింపు కోసమే రీసర్వే అని తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ అన్నారు. కాటవరం, ములకల్లంక పంచాయతీల వద్ద ఆయన ఆధ్వర్యంలో రీసర్వే గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రీసర్వే రైతులకు ఎంతో ఉపయోగమని, చనిపోయిన భూ యజమానుల వారసులు వారి పేరు ఆన్‌లైన్‌లో మార్చుకొనేందుకు, కొనుగోలు చేసిన భూమిని తమ పేరున మార్చుకొనేందుకు ఉపయోగపడుతుందన్నారు. రైతులు తమ రికార్డులు అధికారులకు అందించాలన్నారు. భూములు రీసర్వే చేసే తేదీ సమయం నోటీసుల ద్వారా రైతులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ మూర్తి, మండల సర్వేయర్ గౌతమ్ పాల్గొన్నారు.


సుపరిపాలన వైపు ప్రభుత్వం అడుగులు

అనపర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేసిన అనేక నిర్వాకాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను సరిచేసుకుంటూ సుపరిపాలన వైపు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ(బుజ్జి) అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నామని, ప్రజా ప్రతినిధులు సహకరిస్తే మరింత సాధ్యపడుతుందన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ప్రగతిని అధికారులు వివరించారు. తహశీల్దార్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో 22ఏ జాబితాలో ఉన్న భూములను తొలగించామన్నారు. పశు వైద్యాధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి రైతులకు సబ్సిడీపై అందించిన దాణా వివరాలను వెల్లడించారు. ఆర్‌అండ్‌బీ ఏఈ రాంబాబు మాట్లాడుతూ అనపర్తి నుంచి జోడు నాదాల తూము వరకు కెనాల్ రోడ్డు అభివృద్ధికి రూ.4.5 కోట్లు మంజూరయ్యాయని, మరో రూ.2.70 కోట్లకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఎంపీడీవో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలో అధికారులు పీ4పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పారిశుధ్య పరిరక్షణ కోసం అధికారులకు ప్రజా ప్రతినిదులు సహకరించాలన్నారు.సమావేశంలో ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, ఇతర శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.





గోదారి పరుగులు
గోదావరి తగ్గుముఖం పట్టింది.. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు తగ్గడంతో గోదావరి శాంతించింది. 8

సంతాన సాఫల్య కేంద్రాలు తనిఖీ

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారుల్లో కదలిక తెచ్చిన ఆంధ్రజ్యోతి



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు, ఇతర వైద్యులు ఆయా ఆసుపత్రులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏఆర్‌టీ, సరోగసీ సంతాన సాఫల్యకేంద్రాల్లో సేవా లోపాలపై రెండు రోజుల కిందట 'ఆంధ్రజ్యోతి'లో అమ్మబడును, అమ్మతనానికో రేటు పేరుతో ప్రచురితమైన కథనంపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది.ఈ మేరకు ఏఆర్‌టీ, సరోగసీ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫిర్యాదులకు సంబంధించి ఫోన్ నెంబరును సోమవారం అందుబాటులోకి తెచ్చిన అధికారులు మంగళవారం రాజమహేంద్రవరంలోని ఏఆర్‌టీ, సరోగసీ ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఆయా ఆసుపత్రుల్లో నిబంధనలకు అనుగుణంగా సేవలు అందుతున్నాయా లేదా అన్న విషయాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. సంబంధింత డాక్యుమెంటేషన్‌ను సక్రమంగా నమోదు చేయాలని కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి తనిఖీలు మరింతగా కొనసాగుతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజీవ్, డిప్యూటీ డెమో సత్యకుమార్, రాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ ఫిర్యాదులకు ప్రత్యేక సెల్

కలెక్టర్ ప్రశాంతి



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా, డివిజన్ , మండల స్థాయిలలో గ్రీవెన్స్ సెల్‌లు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి అన్నదాత సుఖీభవ, గృహనిర్మాణం, కమేండ్ ఏరియా అభివృద్ధి, పీ4 సర్వే, సంక్షేమ వసతి గృహాలు తదితర అంశాలపై డివిజన్ , మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు.అన్నదాత సుఖీభవ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల వివరాలకు ఆధార్ లింకింగ్ కీలకమన్నారు. లబ్ధిదారుల ఖాతాకు ఆధార్ లింకింగ్ లేని కారణంగా డీబీటీ జమ కావడంలేదన్నారు. అన్నదాత ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వివరాలకు గ్రీవెన్స్ సెల్ నెంబరు 0883-2944455 అందుబాటులో ఉంటుందన్నారు.గృహ నిర్మాణాలు పురోగతి లేని మండలాల్లో ఎంపీడీవోలు, గృహనిర్మాణ అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.పీ4 బంగారు కుటుంబాలపై దృష్టి సారించాలని,సర్వే వేగవంతం చేయాలన్నారు. కాలువల పూడికతీత పనులపై క్షేత్రస్థాయి నివేదిక కోరారు.ప్రతి శనివారం వసతి గృహాలను ఎంపీడీవోలు,తహశీల్దార్లు సందర్శించాలన్నారు. దోమల నివారణ, మెష్‌లు ఏర్పాటుకు మండల, పంచాయతీ నిధుల నుంచి ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు,డీఆర్వో సీతారామమూర్తి,హౌసింగ్ పీడీ భాస్కరరెడ్డి, సీపీవో అప్పలకొండ, డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆపరేషన్లు సరిగా చేయలేదు..

గోకవరంలో వైద్య బృందం ఎదుట కన్నీళ్లు పెట్టుకున్న మహిళలు

గోకవరం, జూలై29(ఆంధ్రజ్యోతి): వైద్యుల చేసిన శస్త్రచికిత్సలు విఫలమై అనారోగ్యానికి గురైన మహిళలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం గోకవరం ప్రభుత్వాసుపత్రిలో విచారణ జరిపారు.గోకవరం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జేసీ చిన్నరాముడుకు సోమవారం గండికోట విష్ణు అనే వ్యక్తి తన భార్యకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురు వైద్యులతో కూడిన బృందం బాధి తులను ఆసుపత్రిలోనే విచారించారు. నిర్లక్ష్యంగా శస్త్ర చికిత్స చేసిన వైద్యుల గురించి బాధిత మహిళలు కమిటీ సభ్యులకు వివరించారు. మండలంలోని గుమ్మ ళ్ళదొడ్డి, అచ్చుతాపురం, పెంటపల్లి, రంపయర్రంపాలెంతో ఇతర ప్రాంతాలకు చెందిన మొత్తం ఆరుగురు బాధితులు శస్త్ర చికిత్స అనంతరం వారు ఎదుర్కొన్న ఇబ్బందులను విచారణ బృందానికి వివరించారు. తమకు కుట్లు సక్రమంగా వేయకపోవడంతోనే ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యామని వాపోయారు. చివరకు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేస్తేనే గాని ఇబ్బందులు తొలగలేదని బాధిత మహిళలు బృందం వద్ద కన్నీటిపర్యంతమయ్యారు. అనంతరం శస్త్రచికిత్స చేసిన వైద్యులు, పలువురు సిబ్బంది విచారించారు. బాధితులకు అందించిన వైద్య సేవలపై ఆరా తీశారు.విచారణలో భాగంగా ఇరుపక్షాల వాదనలపై నివేదిక తయారుచేసి ఉన్నతా ధికారులకు అంద జేస్తామని బృందం సభ్యులు తెలిపారు.

నోట్లు.. కట్టలు..గుట్టలు!

బ్యాంకుల్లో అన్ క్లయిమ్డ్ డిపాజిట్లు



ఉమ్మడి జిల్లాలో 145 కోట్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా పదేళ్లకుపైగా ఏ మాత్రం లావాదేవీలు జరగని అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లు రూ.145 కోట్లకుపైగా ఉన్నట్టు అంచనా వేశారు. ఈ డబ్బు కోసం పదేళ్ల నుంచీ ఎవరూ రాకపోవడంతో వాటిని ఆర్‌బీఐకి పంపేశారు. స్టేట్‌బ్యాంకు, యూనియన్ బ్యాంకు, గ్రామీణ బ్యాంకు తదితర ప్రభుత్వరంగ బ్యాంకు బ్రాంచ్‌ల్లో రూ.90 కోట్ల వరకు డబ్బు పేరుకుపోయింది. ఆ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ తదితర బ్యాంకుల్లో రూ.35 కోట్ల వరకు నగదు ఉండిపోయింది. కొన్ని బ్యాంకు ఖాతాల్లో రూ.లక్షల్లో నగదు ఉండిపోయినట్టు బ్యాంకులు గుర్తించాయి. అత్యధికంగా ఈ తరహా కేసులు నగరాలు, పట్టణాల పరిధిలో ఉన్నట్టు బ్యాంకులు విశ్లేషించాయి. ఆర్‌బీఐకి బదిలీ చేసిన తర్వాత ఖాతాలో బయటకు సున్నా బ్యాలెన్స్ చూపిస్తుంది. అందులో ఉండిపోయిన నగదు ఆర్‌బీఐ వద్దే ఉంటుంది.



- ఉమ్మడి జిల్లాలో రూ.145 కోట్లపైనే
- పదేళ్ల పైనుంచీ ఖాతాల్లో డబ్బులు
- బ్యాంకుల్లో లావాదేవీలు నిల్
- అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లుగా గుర్తింపు
- ప్రభుత్వ బ్యాంకుల్లో రూ.90 కోట్లు
- ఆ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ,ఐసీఐసీఐ
- 330 బ్రాంచ్‌ల్లో కోట్లు
- ఆర్‌బీఐకి పంపేసిన బ్యాంకులు
- ఆధారాలతో వెళితే ఇచ్చేస్తారు

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో బ్యాంకుల్లో జనం డబ్బు మూలుగుతోంది. ఏళ్ల తరబడి తీయకపోవడంతో కోట్లకు కోట్లు పేరుకుపోతోంది. ఒకటి కాదు రెండుకాదు... పదేళ్లకుపైగా ఆయా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు తీయకపోవడంతో అవన్నీ అన్ క్లయిమ్డ్ డిపాజిట్లుగా మారిపోతున్నాయి. ఆ డబ్బులను బ్యాంకులు చూసీచూసీ ఆర్‌బీఐకి పంపించేస్తున్నాయి. ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 35 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన 330 బ్రాంచ్‌ల్లో దాదాపుగా రూ.145 కోట్లకుపైగా నగదు అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లుగా బ్యాంకులు గుర్తించాయి. అత్యధికంగా ఎస్‌బీఐ, యూబీఐ తదితర బ్యాంకుల్లో డబ్బులు కోట్లలో పోగుపడగా, తర్వాత ప్రైవేటుబ్యాంకుల్లోను ఉన్నాయి.

పదేళ్లు దాటితే అంతే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ,ప్రైవేటు బ్యాంకులు 35 వరకు ఉండగా వీటన్నింటికి కలిపి 330 వరకు బ్రాంచ్‌లు న్నాయి. వీటిలో ప్రజలు మొత్తం రూ.48,500 కోట్ల వరకు డిపాజిట్లు చేశారు. ఒక్క కాకినాడ జిల్లాలోనే రూ.21,307 కోట్లు ఉన్నాయి. ఖాతాదారులు సేవింగ్స్, కరెంట్ ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో డబ్బులు పొదుపు చేస్తారు. తరచూ ఖాతాలో డబ్బులు జమ చేయడం, విత్‌డ్రా చేసుకోవడం జరుగుతుంది. కానీ కొన్ని సేవింగ్స్, కరెంట్ ఖాతాలు మాత్రం ఏళ్ల తరబడి అసలు ఏ లావాదేవీ జరగకుండా ఉండిపోతున్నాయి. వీటిలో ఉన్న డబ్బులను విత్‌డ్రా చేసుకోవడానికి ఎవరూ రావడం లేదు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు ఇలా ఏలావాదేవీ జరగని బ్యాంకు ఖాతాలపై ఆయా బ్రాంచ్‌లు కన్నేసి ఉంచుతాయి. తొలుత రెండేళ్ల పాటు ఏ లావాదేవీ జరగని ఖాతాలుంటే వాటిని నిర్వహణలో లేని ఖాతాగా గుర్తిస్తారు. బ్యాంకు ఖాతాలో డబ్బులు ఉండి కూడా పదేళ్ల వరకు వాటిపై ఏలావాదేవీ జరగకపోతే దాన్ని అన్‌క్లయిమ్డ్‌గా భావిస్తారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఇలా పదేళ్ల పాటు ఉండిపోయిన బ్యాంకు ఖాతాలను ఆయా బ్యాంకులు ఆర్‌బీఐకి పంపాల్సి ఉంటుంది. దీన్నే డీఈఏ (డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్)గా పిలుస్తారు. ఒకవేళ ఆర్‌బీఐకి ఈ తరహా బ్యాంకు ఖాతాలను పంపకపోతే అందులో ఉన్న ఖాతాదారుల డబ్బు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉన్నందున పదేళ్లు దాటిన ఖాతాల సొమ్మును ఆర్‌బీఐకి బ్యాంకులు పంపుతాయి.

తెలియక కొండలా..

ఖాతాదారుడి అకౌంట్‌లో డబ్బులు ఉన్నా ఆ తర్వాత చనిపోయిన ఘటనల్లో ఈ తరహా డిపాజిట్లు పేరుకుపోతున్నట్టు లీడ్‌బ్యాంకు అధికారులు వివరించారు. ఖాతాదారుడు అవివాహితుడే.. లేదంటే గుర్తుతెలియని ప్రదేశాల్లో చనిపోయి ఇప్పటికీ ఆచూకీ దొరకని ఘటనలు, ఖాతాదారుడు చనిపోగా, పిల్లలు,ఇతర రక్తసంబంధీకులు విదేశాల్లో ఉండిపోయి ఇక్కడకు రాని ఘటనల్లో ఈ తరహా అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లు పెరుగుతున్నట్టు పేర్కొన్నారు. ఖాతాదారుడి అకౌంట్లో డబ్బులున్నా సదరు వ్యక్తి మరణం తర్వాత ఆ విషయం వారసులకు తెలియని ఘటనలు సైతం ఇందుకు దోహదం చేస్తున్నాయని తెలిపారు. కొందరు ఖాతాల్లో డబ్బులున్నట్టు గుర్తించి విత్‌డ్రాకు ప్రయత్నిస్తున్నా వారసత్వ ధ్రువీకరణ విషయంలో ఇబ్బందులు ఇందుకు కొంత కారణంగా మారుతున్నాయి. అనేకమంది ఫలానా ఖాతా తమ వారిదేనని వస్తున్నా అందుకుతగ్గ సరైన ఆధారాలు చూపడం లేదని బ్యాంకులు పేర్కొంటున్నాయి.

కొవిడ్ తర్వాత ఇలా..

కొవిడ్ తర్వాత అనేక బ్యాంకు ఖాతాలు అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లుగా మారినట్టు బ్యాంకులు చెబుతున్నాయి. రిజర్వుబ్యాంకు ఆదేశాల మేరకు 2023లో 100 రోజులు 100 పేమెంట్స్ కింద అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లు తిరిగి చెల్లించేందుకు శ్రీకారం చుట్టింది.ప్రతి జిల్లాలో ప్రతి బ్యాంకు తమ టాప్ 100 అన్ క్లెయిమ్ డిపాజిట్లకు సంబంధించి ఖాతాదారులను గుర్తించి నగదు సెటిల్ చేయాలని కోరింది. కానీ ఉమ్మడి జిల్లాలో పెద్దగా ఈ ప్రయోగం ఫలించలేదు. ఖాతాదారులకు అందించేందుకు ఆర్‌బీఐ ఉద్గమ్ (అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు -గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్)పేరిట సెంట్రల్ వెబ్ పోర్టల్‌ను 2023 ఆగస్టులో ప్రారంభించింది. దీని ద్వారా రిజిస్టర్ వినియోగదారులు అన్ని బ్యాంకుల్లోని అన్ క్లెయిమ్డ్ డిపాజిట్ల సమాచారం పొందేలా వివరాలు ఉంచింది.ఎవరికైనా అనుమానం ఉంటే రిజి స్టర్ అయి చెక్ చేసుకోవచ్చని సమాచారం. లేదంటే బ్యాంకులకు వెళ్లి వివరాలు కోరినా చెప్పే అవకాశం ఉంది.

హేవలాక్..అభివృద్ధికి స్మాల్ బ్రేక్!


(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- తొలుత రూ.58 కోట్ల కేటాయింపు
- రూ.46 కోట్లకు తగ్గించిన వైనం
- బరువు విషయమై పునరాలోచన

అఖండగోదావరి పర్యాటక ప్రాజెక్టులో స్వల్ప మార్పులు చేశారు. హేవలాక్ బ్రిడ్జిపై వివిధ రకాల కట్టడాలతో బరువు పెంచితే సమస్య ఏమైనా ఉంటుందా అనే ఆలోచనతో ఆచితూచి అడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో హేవలాక్-బ్రిడ్జిలంక అంచనా వ్యయం కొంత తగ్గించారు. మొదట సుమారు రూ.58 కోట్లతో ఇక్కడ పర్యాటక హంగులు ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు.ప్రస్తుతం ఇక్కడ సుమారు రూ.46 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. హేవలాక్ బ్రిడ్జిని అన్ని భద్రత చర్యలతో మంచి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. దీనికి అనుబంధంగా బ్రిడ్జిలంకను అభివృద్ధి చేయడానికి నిర్ణయించారు.దీనికి సంబంధించి ఇంకా టెండర్ల ప్రక్రియ ఆరంభం కాలేదు. బ్రిడ్జిలంకలో టెంట్ సిటీ, బోటింగ్ ఏర్పాటు చేస్తారు. మొత్తం అఖండ గోదావరి ప్రాజెక్టును స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (శాస్కి) పథకం ద్వారా రూ.94.44 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు సీఎం నారా చంద్రబాబు 2015 పుష్కరాల్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. పుష్కరఘాట్ పనులకు టెండర్లు పిలవడంతో పాటు పనులు ఆరంభించారు. కడియపులంకలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా అభివృద్ధి చేయనున్నారు.ఇక్కడ ఇంకా టెండర్లు ఖరారు కాలేదు. కానీ ముందుగా ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ పనులు పూర్తి చేసే యోచన చేస్తున్నారు. నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయాభివృద్ధి జరగనుంది. నిడదవోలు కాలువలో బోట్ షికారు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయమే లాభదాయకం

వ్యవసాయాధికారి మాధవరావు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకుండా రైతులు ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని మహాకాలేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న అరుణాప్యాలెస్‌లో మంగళవా రం ప్రకృతి వ్యవసాయంపై రాజమహేంద్రవరం సబ్ డివిజన్ పరిధిలో గ్రామ వ్యవసాయ,ఉద్యాన సహాయకులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ శిబిరం ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం లాభదాయకమన్నార. ఏటీఎం పెరటి తోటలు, ఏ గ్రేడ్ మోడల్లో వివిధ పంటల సాగుపై మెలకువలు తెలిపారు.జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు మాట్లాడుతూ పలు పంటల్లో శాస్త్రవేత్తలు పరిశోధనల సిఫారసుకు అనుగుణంగా సమగ్రమైన సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ వరిసాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ పద సంచాలకులు తాతారావు, జిల్లా వనరులు కేంద్రం ఏడీఏ జయరామలక్ష్మి, రాజమహేంద్రవరం వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారులు భీమరాజు, సూర్యరమేష్, కల్యాణ్, అర్బన్ ఏఈవో వేణుమాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల వెనకడుగు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)



- పల్లె పండుగ బిల్లులు పెండింగ్
- చెల్లించాల్సింది రూ.47 కోట్లు
- రోడ్లకు ఉపాధి నిధులు
- రూ.84 కోట్ల పనులకు ఆదేశం
- ముందుకు రాని కాంట్రాక్టర్లు
- సర్కారు పనులపై అనాసక్తి

గతంలో సర్కారు పనులంటే కాంట్రాక్టర్లు క్యూకట్టేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లను భయపెట్టి వదిలేసింది.. దీంతో పనులు చేయడానికి ముందుకు రావడంలేదు. నిధులిస్తేనే పనులు చేస్తామంటూ భీష్మించుకుని కూర్చుంటున్నారు. పంచాయతీ రాజ్ ద్వారా 2025-26 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో ఉపాధి హామీ పథకం నుంచి నియోజకవర్గానికి రూ.12 కోట్ల వంతున సీసీ,బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు.జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో మొత్తం రూ.84 కోట్లతో సుమారు 700 సీసీ, బీటీ రోడ్లను నిర్మించనున్నారు. డ్రెయిన్ల పనులకు ఏ విధమైన శాంక్షన్లు లేవు. కనీసం ఈ రోడ్ల పనులైనా మొదలవుతాయంటే పల్లె పండుగ బిల్లులు పెండింగ్ ఉండడంతో ఈ పనులు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం.

ఇదీ కారణం...

తెలుగుదేశం- జనసేన- బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల నిర్మా ణంపై దృష్టి పెట్టారు. పల్లె పండుగ పేరుతో గత అక్టోబరు నుంచి మార్చి వరకూ జిల్లాలో అనేక ఉపాధి హామీ పథకం కింద రూ. 65.92 కోట్ల నిధులతో జిల్లాలో మొత్తం 667 సీసీ రోడ్లు నిర్మించారు. జిల్లాలో చిన్నా పెద్ద కాంట్రా క్టర్లు సుమారు 50 మందికి పైగా ఈ పనులు చకచకా చేశారు. అధికారులు ముందుగా మే ల్కొనకపోవడం వల్ల కాబోలు గత మార్చి చివరికే మంజూరు కావాల్సిన బిల్లులు కదల్లేదు. కేవలం రూ.19 కోట్లు చెల్లించారు.ఇంకా రూ.46 కోట్ల 92 లక్షల 80 వేలు చెల్లించాల్సి ఉంది. ఈ బిల్లులు వస్తేనే కొత్త పనుల్లో కదలిక వస్తుంది.

పల్లె పండుగ పనులు ఇలా..

మండలం	పనులు	బిల్లులు(కోట్లలో)
అనపర్తి	50	3.33
బిక్కవోలు	70	3.49
రంగంపేట	43	3.64
కొవ్వూరు	10	2.23
చాగల్లు	11	0.85
తాళ్లపూడి	17	2.21
ఉండ్రాజవరం	57	3.00
నిడదవోలు	84	4.09
పెరవలి	39	3.80
గోపాలపురం	12	1.43
దేవరపల్లి	18	2.36
నల్లజర్ల	38	4.67
రాజానగరం	32	4.00
కోరుకొండ	19	7.55
సీతానగరం	5	1.70
గోకవరం	50	10.75
రాజమండ్రి రూరల్	96	4.44
కడియం	16	2.34

కాంట్రాక్టర్ల ఎదురుచూపు..

పల్లె పండుగ నిధులు రాక కాంట్రాక్టర్లు విలవిల్లాడుతున్నారు. రూ. 50 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకూ పెట్టుబడి పెట్టిన వారు ఉన్నారు.పాత బిల్లులు వచ్చేస్తే.. కొత్త రోడ్ల నిర్మాణానికి ముందుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. వర్షాల వల్ల చాలా రోడ్లు పాడైపోతున్నాయి. ప్రస్తుతం మంజూరైన నిధులతో పనులు చేస్తే గ్రామాల్లో మరిన్ని మౌలిక సదుపాయలు కల్పించినట్టు అవుతుంది. ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయి.

పగలు వైద్యం.. రాత్రికి తాళం!


సోమవారం రాత్రి మూసివేసిన ఆసుపత్రి

మంత్రి దుర్గేష్ ఇలాఖాలో ఇదీ వైద్య సిబ్బంది తీరు

- 24 గంటలు వైద్య సేవలు నిల్
- అందుబాటులో ఉండని సిబ్బంది
- అత్యవసరమైనా అంతే
- వేరే ప్రాంతాల నుంచి విధులకు
- ఆరు గ్రామాల ప్రజల ఇక్కట్లు
- సమిశ్రగూడెం పీహెచ్‌సీ దుస్థితి

నిడదవోలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అది సాక్షాత్తూ మంత్రి దుర్గేష్ ఇలాఖా..అంటే ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి..సేవలు సక్రమంగా అందించాలి.. లేదంటే పనిష్మెంట్ అనేది చాలా సివియర్‌గా ఉంటుంది..ఎందుకంటే మంత్రి కదా.. అయినా ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం విధుల్లో అలసత్వం వీడడంలేదు..ఇది ఎక్కడో అయితే పరవా లేదు.. ఎందుకంటే ఒక రోజు కాకపోతే మరో రోజు చేసుకోవచ్చు.సాక్షాత్తు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఈ పరిస్థితి ఉంటే కష్టమే కదా మరి..నిడదవోలు మండలం సమిశ్రగూడెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటలు వైద్య సేవలందించాలి.అయితే పగలు మాత్రమే సేవలందిస్తూ రాత్రి సెలవు తీసుకుంటుంది.అయినా పట్టించుకునేవారులేరు..కన్నెత్తి చూసేవారే లేరు.

అత్యవసరమైతే అంతే..

నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో 2016 సంవత్సరంలో పది పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేశారు. సుమారు ఆరు గ్రామాల ప్రజలకు వైద్య సేవలందించాలి.ఈ ఆసుపత్రిలో ఇద్దరు వైద్యాధికారులు ఒక ఎంపీహెచ్‌ఈవో, ఒక ఫార్మాసిస్ట్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక పీహెచ్ఎన్, ఎంపీహెచ్ఎస్ ఫీమేల్ ఒకరు తదితర సిబ్బంది ఉంటారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీతో పాటుగా అత్యవసర వైద్య సేవలు చూడాలి. దీంతో పాటుగా రాత్రి సమయంలో ఎటువంటి అత్యవసర కేసు వచ్చినా డాక్టర్స్ వచ్చి చూడాలి. అయితే ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పగలు సేవలందుతున్నా సాయంత్రం అయితే చాలు తాళాలు వేసి వెళ్లిపోతున్నట్టుగా స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి సోమవారం రాత్రి 7.30 గంటలకు ఆసుపత్రిని విజిట్ చేయగా అప్పటికే తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. రాత్రి సమయంలో డ్యూటీలో ఉండాల్సి సిబ్బంది లేరు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ 1 స్థానికంగా నివాసం ఉండడం లేదని సమాచారం. రాజమహేంద్రవరం నుంచి పగలు వచ్చి వెళుతుంటారని సమాచారం. దీనిపై మంగళవారం మెడికల్ ఆఫీసర్ 2 డాక్టర్ శ్రీనిధిని వివరణ కోరగా రాత్రి సమయాల్లో స్టాఫ్ నర్స్‌ను డ్యూటీలో ఉంచుతున్నామని ఏ సమయంలో అత్యవసర కేసులు వచ్చిన ఆమె ఇచ్చిన సమాచారంతో అటెండ్ అవుతున్నామని తెలిపారు. మంత్రి దుర్గేష్, జిల్లా ఉన్నతాధికారులు ఈ ప్రాథమిక ఆరోగ్య కేం ద్రంపై దృష్టి సారించాల్సి ఉంది.

పీహెచ్‌సీ 24 గంటలు తెరిచే ఉంచాలి

సమిశ్రగూడెం పీహెచ్‌సీలో 24 గంటలు వైద్య సేవలందాలి.రాత్రి సమయంలో అత్యవసర సేవలందించాల్సి వచ్చినప్పుడు ఖచ్చితంగా వైద్యులు అందుబాటులో ఉండాలి. 24 గంటలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తెరిచే ఉండాలి. పీహెచ్‌సీలో వైద్యాధికారులు స్థానికంగానే నివాసం ఉండాలి. లేకపోతే చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో


పగలు తెరిచి ఉంచిన ఆసుపత్రి

రేపు, ఎల్లుండి విద్యుత్ సరఫనా నిలుపుదల

నల్లజర్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రకాశరావుపాలెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఈ నెల 31వ తేదీ, ఆగస్టు 1వ తేదీన ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశరావుపాలెం, ఆవపాడు గృహ, వ్యవసాయ, వాణిజ్య వినియోగదారులు దీనికి సహకరించాలని కోరారు.

పేద ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత

● సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ముప్పిడి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

కొవ్వూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 33 మందికి రూ. 36,91,465 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. ఇందులో చాగల్లు మండలానికి 12 చెక్కులకు గాను రూ. 5,37,803, కొవ్వూరు మండలంలో 11 చెక్కులకు గాను రూ. 14,38,804, తాళ్లపూడి మండలంలో ఎనిమిది చెక్కులకు గాను రూ. 15,15,358, కొవ్వూరు టౌన్‌లో నలుగురికి రూ. 1,99,500 లక్షలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, మద్దిపాటి సత్యనారాయణ, తోరం నగేష్, కంటిపూడి శ్రీనివాస్, బోడపాటి ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం వ్యవసాయ మార్కెట్ కమిటీకి పూర్వ వైభవం తెస్తా

● పాలకవర్గ మొదటి సాధారణ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు


చైర్మన్ బ్రహ్మరాజును సన్మానిస్తున్న సిబ్బంది, పాలకవర్గ సభ్యులు

గోపాలపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం వ్యవసాయ మార్కెట్ కమిటీకి పూర్వ వైభవం తీసుకొస్తానని ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో పాలకవర్గ మొదటి సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యుల ఏకాభిప్రాయంతో పలు తీర్మానాలు చేశారు. అందులో భాగంగా జాతీయ రహదారికి అనుకుని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, వ్యవసాయ ఉత్పత్తుల క్రయ, విక్రయాలు జరుపుకునేలా రైతులకు అవగాహన కల్పించటం వంటి తీర్మానాలపై పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో మార్కెటింగ్, వ్యవసాయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను కంటికిరెప్పలా కాపాడుకుంటా : ఎమ్మెల్యే


వేలచింతలగూడెంలో బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మంగళవారం వేలచింతల గూడెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అంబేడ్కర్, ఎన్‌టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేలచింతలగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గత శుక్రవారం సాయంత్రం ఈదురు గాలుల కారణంగా ఇళ్లు కోల్పోయి ఇంటి పై కప్పు పడిపోయిన 28 మంది బాధిత కుటుంబాలకు రూ.3,17,000 నగదును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు పార్టీలకు అతీతంగా ఏ అవసరం వచ్చినా .. అర్ధరాత్రి సైతం స్పందిస్తానన్నారు. ఈ సందర్భంగా 25 బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కొర్లపాటి అన్నవరం, గన్నిన మురళి, టీడీపీ మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, సమన్వయ కమిటీ సభ్యులు కొర్లపాటి రాము, గద్దే హరిబాబు, వేముల నాగరాజు, వెంకటాయపాలెం, వేలచింతలగూడెం కమిటీ అధ్యక్షుడు మునేశ్వరరావు, ఇల్లూరి రాము, కాట్రగడ్డ సురేశ్, ఎస్. చరణ్, పరిమి జగదీశ్, గన్నమని చిట్టిబాబు, టీడీపీ నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నల్లజర్ల : రాష్ట్రంలో అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమంపై ప్రభుత్వ దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు, మాజీ జడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు అన్నారు. మంగళవారం నల్లజర్ల గ్రామ టీడీపీ అధ్యక్షుడు బేతిన దుర్గారావు ఇంటి వద్ద సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు సీఎం చంద్రబాబు నిరంతరం కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైయిందన్నారు. ఇందులో ఘంటావారిగూడెంకి చెందిన ఆలపాటి రాంబాబుకి రూ. 3 లక్షల 49 వేల 124, దొండమూడి శ్రీవాసరావుకి రూ.76 వేల 215, నల్లజర్లకు చెందిన నక్కా భవానీ సాయి ప్రవల్లికకు రూ.66 వేల 218, కండెపు కుమారికి రూ. 61 వెయ్యి 294, గన్నిన నాగేశ్వరరావుకి రూ. 51 వెయ్యి 684, మండలపు యశోదకు రూ.30 వేల 554 చెక్కులు అందించారు. టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, ఆలపాటి రామకృష్ణ, చింతా చైతన్య, కోడూరి నారాయణ, నాదెళ్ల శివకుమార్ , తదితరులు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటేశ్వరరావు

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు


సత్యవాడలో వరి పంటను రైతులతో కలిసి పరిశీలిస్తున్న ఏవో రాజారావు

ఉండ్రాజవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నూతన వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు పెంచాలని ఏవో బీ. రాజారావు పేర్కొన్నారు. మంగళవారం సత్యవాడ, కాల్ధరిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తూ రైతులతో ఆయన మాట్లాడారు. నానోయూరియా, డీఏపీల వినియోగాన్ని పెంచడం ద్వారా రసాయనిక ఎరువుల వాడకాన్ని 10 నుంచి 25 శాతం వరకు తగ్గించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రామభద్రరాజు, కే. విశ్వనాథం, కే.రాంప్రసాద్, వ్యవసాయశాఖ సిబ్బంది స్వప్నమీనాక్షి, సాయికుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మోతాదు మించి ఎరువులు వాడొద్దు


త్యాజంపూడిలో వరిపొలాలు పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

దేవరపల్లి: సార్వాలో వరిపంటకు ఎరువులు మొక్కదశలో సరైన మోతాదులో వాడుకోవాలని మండల వ్యవసాయాధికారి కలమరాజు పేర్కొన్నారు. త్యాజంపూడి, కురుకూరులో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మొక్కదశలో వరికి మోతాదు మించి ఎరువులు వాడితే మొక్కకు అందాల్సిన సూక్ష్మ పోషకాలైన జింక్ అందకుండా చేస్తాయన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ ఎరువులను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో సంజన, బీఏఏ బీ.సురేశ్, యు.భాస్కర్, రైతులు అంకెల భూపతిరావు, అర్సన భూపతి, కొడూరి వెంకట రత్నం, దావాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్ల బిగింపును అడ్డుకోవాలి : సీపీఎం


దేవరపల్లిలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

దేవరపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గృహాలకు అదానీ స్మార్ట్‌మీటర్ల బిగింపును ప్రజలు అడ్డుకోవాలని సీపీఎం కార్యదర్శి ఎస్.భగత్ మంగళవారం పిలుపునిచ్చారు. దేవరపల్లిలో సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై వేలకోట్ల భారం మోపిందన్నారు. విద్యుత్‌ను ప్రైవేటీకరించే కుట్రలో భాగమే అదానీ స్మార్ట్‌మీటర్ల బిగింపని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం సహాయ కార్యదర్శి కే.రత్నాజీ, సీపీఎం నేతలు ఉండవల్లి కృష్ణారావు, మడెల్లి రామారావు, పిన్నమనేని సత్యనారాయణ, జనపర్తి శ్రీనివాసరావు, ఆచంట సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

బిక్కవోలు, జూలై 29(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వైద్యాధికారి ఎం. దుర్గాదేవి అన్నారు. రంగాపురం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం టీనేజీ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే అనర్థాలు గురించి సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసుకోవడం వల్లే ముందస్తుగా గర్భం దాల్చుతారన్నారు. దీనివల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రధానంగా బిడ్డలు తక్కువ బరువుతో పుట్టడం, పుట్టుకతో వచ్చే మానసిక అంగవైకల్యం, పోషకాహార లోపం లాంటివి వస్తున్నాయన్నారు. అందువల్ల అబ్బాయిలకు 25, అమ్మాయిలకు 21 సంవత్సరాలు నిండితేనే వివాహాలు చేసుకోవాలన్నారు. కూటమి నేతలు నడింపిల్లి చిరంజీవిరాజు, చెల్లే జోష్ బాబు, పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్, ఆరోగ్య, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో అంగన్వాడీ భవనం వద్దు


దేవరపల్లిలో ఆందోళన చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

దేవరపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలోని ఎస్సీ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో అంగన్వాడీ భవనాన్ని నిర్మించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు చిర్రా రాజు, చిర్రా కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారంతా ఎస్సీ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ 1200 కుటుంబాలున్న ఎస్సీపేటలో గల కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం ఈ ప్రాంగణాన్ని స్థానిక ప్రజలు ఉపయోగించుకుంటున్నారని, ఇప్పటికే ఆ కమ్యూనిటీ హాలు పక్కన అంగన్వాడీ భవనం ఉండగా, మరొక అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నారని, దీన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పల్లికొండ సునీల్, రాపాక అబ్బులు, పత్తిపాటి వెంకట్రావు, మల్లిపూడి శాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

వేములూరులో డ్రోన్ సాయంతో ద్రావణాల స్ప్రే


డ్రోన్‌ను సిద్ధం చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

కొవ్వూరు, జూలై29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో కషాయాలు, ద్రావణాలు స్ప్రే చేయడం ద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవచ్చునని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు సూచించారు. మంగళవారం వేములూరులో ఏపీసీఎన్‌ఎఫ్ ఆధ్వర్యంలో డ్రోన్ సహాయంతో కషాయాలు, ద్రావణాలు స్ప్రే చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ ధరణి, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది ఎన్.వరప్రసాద్, ఎస్.సంధ్య, కె.కనకదుర్గ, దయామణి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

12న ప్రభుత్వ జీపు వేలం

కొవ్వూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి చెందిన అవసరం లేని ఏపీ 37బీ 2527 నెంబరు గల ప్రభుత్వ జీపును వచ్చేనెల 12వ తేదీన వేలం వేయనున్నారు. రాజమహేంద్రవరం ఆర్టీఏ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. వేలం తేదీకి ముందు ఈనెల 30వ తేదీ నుంచి ఆగస్టు 10 వరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం పనివేళల్లో వాహనాన్ని తనిఖీ కోసం అందుబాటులో ఉంటుందన్నారు.

ఉచిత కుట్టుమిషన్‌లో శిక్షణ


శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న శిక్షకురాలు మోహనదుర్గ

తాళ్లపూడి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడిలో మహిళలకు ఉపాధి కలిగే విధంగా బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా కుట్టుమిషన్‌లో శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా సుమారు 48 మంది మహిళలు హాజరవుతున్నారు. శిక్షణ కేంద్రం శిక్షకురాలు మోహన దుర్గ మాట్లాడు తూ అధికారులు ఆదేశాల మేరకు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో ఓసీ, బీసీ అభ్యర్థులు అప్లికేషన్ పెట్టుకోవచ్చన్నారు. ప్రతిరోజూ మూడు గంటల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రతి ఒక్కరికీ సర్టిఫికేట్ అందజేస్తామన్నారు. కుట్టుమిషన్ కూడా బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందిస్తుందని శిక్షకురాలు మోహన దుర్గ తెలిపారు.

'పెన్షన్ భిక్ష కాదు... హక్కు'


సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్యం

నల్లజర్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం అందించే పెన్షన్ భిక్ష కాదని ... అది వారి హక్కు అని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఐవీ సత్యం అన్నారు. పింఛన్ పితామహుడు, ధరం స్వరూప్ నకారా వర్ధంతి సందర్భంగా మంగళవారం నల్లజర్ల హైస్కూల్‌లో విశ్రాంత ఉద్యోగులు నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కూటమి ప్రభుత్వ ఏర్పడి సంవత్సరం పూర్తి అయినప్పటికీ... కనీసం ఒక కరువు భత్యం కూడా విడదల చేయకపోవడం బాధాకర మన్నారు. వెంటనే వేతన సవరణ కమిషన్ వేసి తాత్కాలిక భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాశరావు, ఎస్ఎం ఆలీసాహెబ్, బాలయ్య, ఎన్. రాజేంద్రప్రసాద్, ఐడీవీ అప్పారావు, ప్రభుదాసు, నెక్కలపూడిప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సుబ్రహ్మణ్యం

దేవరపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. యర్నగూడెం బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణలో వాహనాలు నిలుపుదల చేయరాదన్నారు. అలాగే వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ వంటివి చట్టవ్యతిరేక పనులన్నారు.

పారిశుధ్య రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి : చైర్‌పర్సన్


పట్టణంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపాల్టీని పారిశుధ్య రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై వస్తున్న ఫిర్యాదులపై మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 5వ వార్డు సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, 12వ వార్డు మూడు డాబాలవీధి, లాంచీలరేవు, టౌన్ చర్చి ఎదురుగా నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. అలాగే ఇంటింటా చెత్త సేకరణ, సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించడంలో ఫిర్యాదులనూ వస్తున్నాయన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున్న పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సిబ్బందిని సూచించారు. కమిషనర్ జి.సందీప్, శానిటరీ సెక్రటరీ రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి : ఎంపీడీవో


కలవలపల్లిలో దుకాణదారుడుకి నోటీసు అందజేస్తున్న ఎంపీడీవో శ్రీదేవి

చాగల్లు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలు సహకరించాలని, ప్లాస్టిక్ కవర్లకి బదులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపీడీవో ఆర్. శ్రీదేవి అన్నారు. కలవలపల్లిలో తడి చెత్త, పొడి చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లు వాడకుండా దుకాణ యజమానులకు నోటీసులు అందజేశారు. కవర్లు వాడితే అపరాధ రుసుము విధించడంతో పాటుగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఎంపీడీవో వీఎస్ రామారావు పేర్కొన్నారు. మంగళవారం కాల్ధరిలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు నిషేధాన్ని తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ఆగస్టు 1 నుంచి మండలంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు, క్యారీ బ్యాగ్‌లు అమ్మినవారికి జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారికి చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కే. ఆంజనేయశర్మ, పంచాయతీ కార్యదర్శి వీ. శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


కాల్ధరిలో దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో, ఈఓపీఆర్డీ, తదితరులు

స్నానఘట్టాలను ముంచెత్తి'నది'


గోష్పాదక్షేత్రంలో వద్ద ప్రవహిస్తున్న నది

కొవ్వూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నదికి వరద నీరు అధికంగా వచ్చి చేరుతోంది. దీంతో కొవ్వూరు, రాజమహేంద్రవరం మధ్య అఖండ గోదావరి నిండుకుండలా ప్రవహిస్తోంది. గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టాలు వరద ప్రవాహంతో మునిగిపోయాయి. క్షేత్రంలోని కనకదుర్గమ్మ ఆలయం ఎదురుగా ఉన్న స్నానఘట్టంలో కాశీ విశ్వేశ్వరస్వామి, ఆవు, ఇతర దేవతామూర్తుల విగ్రహాలను ముంపునకు గురయ్యాయి. నది ఉధృతంగా ప్రవహిస్తున్నందున నదిలో ఎవరూ దిగరాదని పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. గోష్పాదక్షేత్రంలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద మంగళవారం సాయంత్రానికి 6,01,844 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదయ్యింది.

రూ. 15వేలు ఆర్థిక సాయం అందజేత

నల్లజర్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తెలికిచర్ల సర్పంచ్ బండి చిట్టి, జనసేన సీనియర్ నేత రుద్ర శ్రీను పుట్టినరోజు సందర్భంగా అదే గ్రామానికి చెందిన మూడు కుటుంబాలకు వైద్యఖర్చుల నిమిత్తం రూ. 15 వేల ఆర్థికసాయం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

గోపాలపురం టీడీపీ మండల అధ్యక్షుడిగా రాము



గోపాలపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం మండలం టీడీపీ అధ్యక్షుడిగా వేలచింతల గూడెంకి చెందిన కొర్లపాటి శ్రీరామ చంద్రరావు (రాము)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటికే మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు గ్రామ కమిటీలను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు నియమించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం వేలచింతలగూడెంలో జరిగిన సమావేశంలో రాము పేరును ప్రకటించారు. గతంలో ఈయన వేలచింతల గూడెం గ్రామ సర్పంచ్‌గా, టీడీపీ మండల అధ్యక్షుడిగా సమర్థవంతంగా పని చేశారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కష్టకాలంలో పార్టీ కోసం పని చేసిన రాముకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నాయకులంతా ముక్తకంఠంతో ఆమోదం తెలిపారు. నాయకుల ఏకాభిప్రాయం మేరకు ఎమ్మెల్యే మద్దిపాటి రాము పేరును సభాముఖంగా ప్రకటించారు. ఈ సందర్భంగా రాముకు టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.